మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 21-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 292 Issue: 292


శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:59 సూర్యాస్తమయం - సా. 6:30 తిథి పంచమి రా. 1:22o వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం మృగశిర రా. 11:59 వరకు తరువాత ఆరుద్ర యోగం శోభన మ. 12:32 వరకు కరణం బవ మ. 2:48 వరకు బాలవ రా. 1:22o వరకు వర్జ్యం ఉ. 7:14 నుండి ఉ. 8:41 వరకు దుర్ముహూర్తం ఉ. 8:29 నుండి ఉ. 9:19 వరకు రా. 11:05 నుండి రా. 11:51 వరకు రాహుకాలం మ. 3:22 నుండి సా. 4:56 వరకు యమగండం ఉ. 9:07 నుండి ఉ. 10:41 వరకు గుళికకాలం మ. 12:15 నుండి మ. 1:48 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:23 నుండి తె. 5:11 వరకు అమృత ఘడియలు మ. 3:57 నుండి సా. 5:24 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:40 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున


Published from Jagitial

Circulated to Telangana




# హైడ్రాను పీకేస్తా..

**అధికారంలోకి వచ్చాక తొలి సంతకం దానిపైనే**

**రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆగమైనరు**

**మళ్లీ తెలంగాణను పునర్నిర్మించే యజ్ఞం చేపట్టాలి**


**జగిత్యాల ప్రజాఆశీర్వాధ సభలో కేసీఆర్ వెల్లడి**

**పార్టీ ప్రధాన కార్యదర్శిగా జీవన్ రెడ్డి నియామకం**

గ్రామ పంచాయతీలను నాశనం పట్టించారని.. మున్సిపాలిటీలను మురికి కూపం పట్టించారని కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. మరి ఏం సక్కగుందని ప్రశ్నించారు. అందుకే కాంగ్రెస్ పోవాలి.. బీఆర్ఎస్ రావాలి అని జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకులు అంటున్నారని తెలిపారు. వాళ్ల నోటి నుంచి వట్టిగానే ఆ మాట వస్తదా.. బాధ్యత లేకుండానే వస్తదా అని ప్రశ్నించారు. ఏం చూసినా సక్కగా లేకపోతే.. పొద్దున లేస్తే దోపిడి తప్ప ఇంకోటి లేకపోతే ఎందుకు ఈ పరిస్థితి వస్తుందని అడిగారు.



జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 20 (ఈవార్తలు): జగిత్యాలలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నాశనం.. ఉద్యోగస్తులు ఆగం.. రిటైర్డ్ ఉద్యోగస్తులు ఆగం.. విద్యార్థుల జీవితం ఆగం.. ఆటో కార్మికుల జీవితాలు ఆగం.. ఎవరు సక్కగున్నరు అని కేసీఆర్ అడిగారు. సంతృప్తిగా ఎవరున్నారని అన్నారు. ఈ అందానికి బోడి ముండ హైడ్రాను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో హైడ్రా ఉందని.. నిజామాబాద్‌కు నిడ్రా తీసుకొస్తామని పీసీసీ ప్రెసిడెంట్ ఒకరు చెబుతున్నారని మండిపడ్డారు. రేపు జగిత్యాలకు జిడ్రా అంటాడని సెటైర్ వేశారు. మీకేం కావాలి.. పేదోళ్ల కొంపలు కూల్చడమేనాతరువాయి 2 వ పేజీలో...



# కేసీఆర్‌ను రానియ్య

**ప్రతిపక్ష హోదా కూడా దక్కనివ్వను**

**లేకపోతే పేరు మార్చుకుంటా.. ఇదే నా శపథం**

**జీవన్ రెడ్డి కాంగ్రెస్ గుండెపై తన్నారు**

**నస్తూర్‌పల్లి బహిరంగ సభలో సీఎం రేవంత్**

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గద్దె దించామని చెప్పిన సీఎం.. 2029 ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే తన పేరు మార్చుకుంటానని శపథం చేశారు. లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల సాక్షిగా ఇదే తన సవాల్ అంటూ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో నువ్వో, నేనో తేల్చుకుందాం అంటూ కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి ఛాలెంజ్ విసిరారు. ఇక ప్రజాపాలన పోవాలి అంటూ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన రేవంత్ రెడ్డి.. పాపాల భైరవుడు రావాలి అంటున్నారని ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌లో ఉండే పాపాల భైరవుడు మళ్లీ అధికారంలోకి ఎందుకు రావాలని ప్రశ్నించారు.



భూపాలపల్లి బ్యూరో, ఏప్రిల్ 20 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో.. రాష్ట్రంలోని అన్నదాతలకు రైతు భరోసా రెండు విడత నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి .. రాష్ట్రంలో పెద్ద పెద్ద ప్రాజెక్టులను కట్టింది, రైతులకు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,529 |
| వెండి (గ్రాము): | రూ.280 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,224 |

## విశ్వవాణి



రిమోట్ గొప్పదనం ఏంటో ఈ వార్త చదివితే తెలుస్తుంది. ఐర్లాండ్‌లోని డబ్లిన్‌లో ఓ బ్రిడ్జిని నౌకల రాకపోకల కోసం తెరిచేవారు. అయితే, అది నాలుగేళ్లపాటు మూసే ఉంది. ఆ బ్రిడ్జి సిబ్బందిలో దానికి సంబంధించిన రిమోట్ పోగొట్టడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

# కేజ్రీవాల్ రీక్యూసల్ పిటిషన్ కొట్టేవేత



**న్యాయమూర్తిగా నా బాధ్యత నాకు తెలుసు**

**ఇలాంటి ఉచ్చులో నేను పడబోను**

**జస్టిస్ స్వరణ్ కాంత్ శర్మ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో జస్టిస్ స్వరణ్‌కాంత శర్మను విచారణను నుంచి తప్పించాలని కోరుతూ పిటిషన్ వేసిన ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తదితరులకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన విశ్వసనీయతను, నిష్పాక్షితను ప్రశ్నిస్తూ దాఖలైన ఈ పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్టు జస్టిస్ స్వరణ్‌కాంత్ శర్మ స్పష్టం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం అనుమానాల ఆధారంగా న్యాయమూర్తి సమగ్రతను సవాలు చేయడం తగదని అన్నారు. 'నేను పెన్నుతో జడ్జిమెంట్ -2 వ పేజీలో...



# ఢిల్లీలో హరీశ్ బృందం

**కాళేశ్వరం కమిషన్‌పై చర్చలు**

న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయింపులు, కాళేశ్వరం కేసుల నేపథ్యంలో న్యాయపరమైన చర్చల కోసం బీఆర్ఎస్ త్రిసభ్య బృందం ఢిల్లీకి చేరుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం సీనియర్ న్యాయవాదులతో హరీశ్‌రావు, వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర సమావేశం అయ్యారు. కాళేశ్వరంపై బుధవారం తెలంగాణ హైకోర్టులో తీర్పు రానుంది. ఒకవేళ తీర్పు ప్రతికూలంగా వస్తే వెంటనే సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపుల కేసు, తరువాయి 2 వ పేజీలో...

# 23న కేబినెట్ సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఈవార్తలు): ఈ నెల 23వ తేదీన తెలంగాణ కేబినెట్ భేటీ కానుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మంత్రులతో పాటు ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. మంత్రి వర్గ సమావేశంలో పలు అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహించే అంశంతో పాటు జూన్ 2న నిర్వహించబోయే రాష్ట్ర అవతరణ దినోత్సవాలు, ఇతర అంశాలపై కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉంది. రైతు భరోసా చివరి విడుత నిధుల విడుదలపై కూడా చర్చించనున్నట్లు సమాచారం.

# వడ్డీతో సహా వసూలు

**అమెరికా టారిఫ్‌ల రీఫండ్ మొదలు.. 166 బిలియన్ డాలర్లు వాపస్**




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ చట్టవిరుద్ధమని సుప్రీం కోర్టు ప్రకటించిన నేపథ్యంలో వాటిని రీఫండ్ చేసేందుకు అమెరికా ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ఏడాది ప్రారంభంలో టారిఫ్ విధించడం రాజ్యాంగ విరుద్ధమని ఆ దేశ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ట్రంప్ ప్రభుత్వం దిగుమతిదారులకు సుమారు 166 బిలియన్ డాలర్ల విలువైన సుంకాలను వాపసు చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు ఇచ్చిన -2 వ పేజీలో...



# జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాలు విడుదల

**సత్తా చాటిన ఏపీ, తెలంగాణ విద్యార్థులు**

**దేశవ్యాప్తంగా 26 మందికి 100 పర్సంటైల్**

**మే 17న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహణ**

న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ 2026 సెషన్-2 తుది విడత ఫలితాలు విడుదలయ్యాయి. జాతీయ పరీక్షా సంస్థ (ఎన్టీఏ) సోమవారం సాయంత్రం ఈ తరువాయి 2 వ పేజీలో...

# నేటి అర్ధరాత్రి నుంచి బస్సులు బంద్!?

**సమ్మెకు ఆర్టీసీ కార్మిక సంఘాలు పిలుపు.. ప్రభుత్వ చర్యలపై తీవ్ర ఉత్కంఠ**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఈవార్తలు): తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు సమ్మె బాటకు రెడీ అయ్యారు. మంగళవారం అర్ధరాత్రి (ఏప్రిల్ 21 అర్ధరాత్రి) నుంచే సమ్మెకు వెళ్లేందుకు ఆర్టీసీ జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల పునరుద్ధరణ సహా పలు డిమాండ్ల పరిష్కారమే ధ్యేయంగా ఆర్టీసీ జేఏసీ సమ్మెకు పిలుపునిచ్చింది. ఈదురు వెంకన్న, థామస్ రెడ్డి నేతృత్వంలోని ఆర్టీసీ జేఏసీ సమ్మెపై తీవ్రంగా కసరత్తు చేసింది. అన్ని డిపోల పరిధిలో మీటింగులు తరువాయి 2 వ పేజీలో...



# రాశి ఫలాలు

20.4.2026

మేషం: బంధువులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. దైవదర్శనాలు చేసుకుంటారు. చేపట్టిన పనుల్లో ప్రతిష్టంభనలు కలుగుతాయి. వృధా ఖర్చులు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోక పోవడం మంచిది. మానసిక ఒత్తిడి పెరుగుతుంది.

వృషభం: నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. దూర ప్రాంత మిత్రుల నుండి విలువైన విషయాలు సేకరిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. సమాజంలో గౌరవ మర్యాదలుకు లోటు ఉండదు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

మిధునం: స్థిరాస్తి కొనుగోలు అవరోధాలు తొలగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తి చేస్తారు. నూతన వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి.

కర్కాటకం: ధన పరంగా ఒడిదుడుకులు ఉంటాయి. దూర ప్రయాణాలలో శ్రమాధిక్యత కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. సోదరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఉద్యోగమున బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించలేక అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది.

సింహం: దూర ప్రయాణాలలో మార్గావరోధాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికావు. వృత్తి వ్యాపారాలలో ఊహించని ఇబ్బందులు కలుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కన్య: పాత మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో విందు వినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతన విద్య ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నూతన ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. వృత్తి ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

తుల: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యులు సలహాలు కొన్ని విషయాల్లో కలిసి వస్తాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు సఫలమవుతాయి. స్థిరాస్తి సంభందిత క్రయవిక్రయాలలో లాభాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగమున ఉన్నతి కలుగుతుంది.

వృశ్చికం: ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. కుటుంబ పెద్దల అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ధన పరంగా తొందరపడి ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలు సమస్యాత్మకంగా సాగుతాయి. ఉద్యోగమున సమస్యలు కలుగుతాయి.

ధనస్సు: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. అకారణంగా బంధువులతో వివాదాలు కలుగుతాయి. కొన్ని వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. కొందరి మాటల వలన మానసిక సమస్యలు కలుగుతాయి. వ్యాపారాలలో భాగస్వాములతో మాటపట్టింపులు ఉంటాయి. నిరుద్యోగులకు అధిక శ్రమతో కాని ఫలితం అందదు.

మకరం: బంధుమిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహమున వివాహాది శుభకార్యాలు నిర్వహిస్తారు. నూతన వాహన భూ లాభాలు ఉంటాయి. వృత్తి, వ్యాపారాలలో పెట్టుబడులకు తగిన లాభాలు అందుకుంటారు.

కుంభం: చేపట్టిన పనుల్లో ప్రతిష్టంభన కలుగుతుంది. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. శ్రమతో కూడిన దూరప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులతో ఊహించని విభేదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి.

మీనం: దాయాదులతో స్థిరాస్తి వివాదాల పరిష్కారం అవుతాయి. శుభకార్యాల కొరకు ధనం ఖర్చు చేస్తారు. సంఘంలో పెద్దల ఆదరణ పెరుగుతుంది. అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో సమస్యలు అధిగమిస్తారు.

# కేసీఆర్‌ను రానియ్యి



మొదటి పేజీ తరువాయి

నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని తేల్చి చెప్పారు. అదే సమయంలో అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే చట్టాన్ని తీసుకొచ్చిందని కూడా గుర్తు చేశారు. అదే సమయంలో దేశంలోనే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన మొట్టమొదటి పార్టీ కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గద్దె దించామని చెప్పిన సీఎం.. 2029 ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే తన పేరు మార్చుకుంటానని శపథం చేశారు. లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల సాక్షిగా ఇదే తన సవాల్ అంటూ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో నువ్వో, నేనో తేల్చుకుందాం అంటూ కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి ఛాలెంజ్ విసిరారు. ఇక ప్రజాపాలన పోవాలి అంటూ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన రేవంత్ రెడ్డి.. పాపాల భైరవుడు రావాలి అంటున్నారని ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌లో ఉండే పాపాల భైరవుడు మళ్లీ అధికారంలోకి ఎందుకు రావాలని ప్రశ్నించారు. రాష్ట్రంలోని లక్షల మంది కాంగ్రెస్ కార్యకర్తలు జెండా మోస్తే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఎందుకు పాపాల భైరవుడు రావాలో.. పార్టీ మారిన జీవన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. జీవన్‌రెడ్డి చరిత్ర, ఆయన వెనక ఉన్న మచ్చలు అన్నీ తనకు తెలుసని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. 40 ఏళ్లుగా తనకు, తన కుటుంబానికి జీవన్ రెడ్డి ఎన్నో పదవులను తీసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 14 సార్లు బీ ఫామ్ ఇస్తే.. ఇప్పుడు పార్టీని మోసం చేసి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిపోయారని ఆరోపించారు. ఓడిపోయినా ఎన్నోసార్లు పదవులు, టికెట్లు ఇచ్చి జీవన్ రెడ్డిని కాంగ్రెస్ గౌరవించిందని గుర్తు చేశారు. ఒక్క ఏడాది పదవి లేకపోతే కాంగ్రెస్ కార్యకర్తల గుండెలమీద తన్ని జీవన్‌రెడ్డి శత్రువు వైపు చేరారని మండిపడ్డారు. తెలంగాణలో నిరుద్యోగులకు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పోవాలా అని ప్రశ్నించారు. ఒక్కరికి పదవి రాకపోతే.. ప్రజా ప్రభుత్వం పోవాలా అని నిలదీశారు. నేరెళ్లలో ఇసుక లారీలతో తొక్కించి ఎస్సీలను చంపినందుకు పాపాల భైరవుడు మళ్లీ రావాలా అన్నారు. వాస్తు కోసం బాగున్న సచివాలయాన్ని కూల్చేసి.. కొత్తది కట్టారని.. తండ్రి, కొడుకు, బిడ్డ ఇలా ముగ్గురూ ఫామ్‌హౌస్ కట్టుకున్నారని.. కానీ పేదలకు ఇళ్లు ఇవ్వాలని ఎప్పుడైనా ఆలోచించారా అని నిలదీశారు. దొరల గడీల ముందు పేదలు ఊడిగం చేస్తూ ఇప్పటికీ అలాగే ఉండాలని భావించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కట్టుకోవడానికి పనికిరాని బతుకమ్మ చీరలను గత ప్రభుత్వంలో పేదలు పంచారని సీఎం ఆరోపించారు. వేములవాడకు రూ.100 కోట్లు ఇస్తానని కేసీఆర్ చెప్పారని.. కానీ 10 ఏళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇక తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చేసి చూపించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. రుణమాఫీ పథకం కింద రాష్ట్రంలోని 25.35 లక్షల మంది అన్నదాతల అకౌంట్లలో రూ.22 వేల కోట్లు జమ చేశామని ప్రకటించారు. గతంలో 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా పథకం కింద నిధులు జమ చేసినట్లు తెలిపారు. తాజాగా రెండో విడతలో భాగంగా రూ.5,700 కోట్లను రైతుల ఖాతాల్లో వేసినట్లు తెలిపారు. మిగిలిన రూ.3,300 కోట్ల నిధులను వచ్చే నెలలో ఇస్తామని వెల్లడించారు. తెలంగాణలోని 3.5 కోట్ల మంది పేద ప్రజలకు సన్నబియ్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు.

## కాళేశ్వరం.. కేసీఆర్ చేసిన పాపం

మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సాంకేతిక సంస్థలు, ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసమే కేసీఆర్ కొత్త డిజైన్లకు శ్రీకారం చుట్టారని విమర్శించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే రాష్ట్రానికి మేలు జరిగేదని, కానీ కమీషన్ల కోసం మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలను కట్టారని ఆరోపించారు. కాళేశ్వరాన్ని ఒక అద్భుతమైన కట్టడంగా ప్రపంచానికి చూపిస్తూ ప్రజలను మభ్యపెట్టారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. 2016లో పనులు మొదలుపెట్టి 2019 నాటికి హడావుడిగా పూర్తి చేసి కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. 2020 నుండే బ్యారేజీలలో లీకులు ఉన్నట్లు ఇంజనీర్లు నిర్మాణ సంస్థలకు లేఖలు రాసినా ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. వాస్తవాలను దాచిపెట్టి ప్రజల కళ్లు కప్పే ప్రయత్నం చేశారని, కేసీఆర్ చేసిన పాపాన్ని ప్రకృతి బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ బ్యారేజీ కూలిన తర్వాత ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక ప్రాజెక్టు వైఫల్యాన్ని స్పష్టం చేస్తోందని చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నీళ్లు నిల్వ చేసేందుకు ఏమాత్రం పనికిరాదని నివేదికలు తేల్చాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని కేంద్రానికి మరోసారి లేఖ రాసినట్లు వెల్లడించారు. ఒకవేళ కేంద్రం విచారణకు ఆదేశించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీబీఐ విచారణ ఎక్కడ మొదలవుతుందోనన్న భయంతోనే హరీష్ రావు రహస్యంగా ఢిల్లీ వెళ్లారని ఎద్దేవా చేశారు. బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకొని విచారణను అడ్డుకోవడమే హరీష్ రావు పర్యటన ఉద్దేశమని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే తమ స్వప్రయోజనాలే ముఖ్యం అన్నట్లుగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

# హైడ్రాను పీకేస్తా..

మొదటి పేజీ తరువాయి

అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో మూడున్నర లక్షల మందికి ఎక్కడ ఉంటే అక్కడే పట్టాలిచ్చామని కేసీఆర్ గుర్తుచేశారు. కానీ ఇవాళ ఏం కూలగొడుతున్నారని మండిపడ్డారు. పిల్లలను పుస్తకాలు కూడా తీసుకోనివ్వరా.. అంత ఎగిర్తమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేది ఖాయమని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజుల్లోనే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తామని హామీ ఇచ్చారు. మొదటి సంతకంతోనే హైడ్రాను తీసి చెరువులో పడేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 46వేల చెరువులు మంచిగా చేశామని.. కానీ ఒక్క గుడిసె కూడా కూలగొట్టలేదని స్పష్టం చేశారు. మూసీ అని గరీబోళ్లను ఏడిపిస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. పొద్దున లేస్తే నిద్రపోకుండా, వారి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 వేల ఇళ్లు కూలగొడతామని అంటున్నారని.. అది ధర్మమేనా అని ప్రశ్నించారు. మూసీని మంచిగ చేయాల్సిందేనని.. కానీ ఇళ్లు కూలగొట్టుడు ఎందుకని నిలదీశారు. భూములు కబ్జా పెట్టే రియల్ ఎస్టేట్ దందా తప్ప అందులో ఏమీ లేదని అన్నారు. ఈజీగా చేయగలిగిన దాన్ని నాశనం పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఏది చూసినా కూడా ఒకరకమైన దోపిడీ, ఒకరకమైన గుండాగిరి, అరాచకంతో ముందుకెళు న్నారే తప్ప.. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ఒక్క స్కీమ్ కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను పండబెట్టింర్రని.. ఏం రోగమని కేసీఆర్ ప్రశ్నించారు.

## మోటర్లకు మీటర్లపై యుద్ధమే

కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ అధినేత విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రజలకు పనికొచ్చే పని ఒక్కటి కూడా లేకపోగా.. కూల్చివేతలు, కాల్చివేతలు, పోలీసుల దాడులు, ఎదురు మాట్లాడితే వారిని పట్టుకుపోవడమే ఉందని విమర్శించారు. ఇది అసలు రాజకీయమా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఏం జరుగుతుందని ప్రశ్నించారు. ఈ సందర్భంలో ప్రజల మంచిని కోరే ప్రతి ఒక్కరూ ఒక్కటి కావాల్సిందేనని పిలుపునిచ్చారు. తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం మళ్లీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆనాడు బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయ కరెంటు మోటార్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ ఒత్తిడి తీసుకొచ్చారని కేసీఆర్ గుర్తుచేశారు. నా ప్రాణం పోయినా సరే మీటర్లు పెట్టనని చెప్పానని.. అన్నట్లుగానే పెట్టలేదని తెలిపారు. మీటర్లు పెట్టకపోతే 30 వేల కోట్లు కట్ చేస్తానని మోదీ అన్నాడని.. కట్ చేశాడని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే 30 వేల కోట్ల ఆదాయాన్ని వదులుకుని కూడా తెలంగాణలో కరెంటు మీటర్లు పెట్టనివ్వలేదని చెప్పారు. కానీ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లి కరెంటు మీటర్లు పెట్టేందుకు ఒప్పుకున్నారని తెలిపారు. అప్పటి రూ.30వేల కోట్లు తీసుకుని.. వ్యవసాయ కరెంటు మీటర్లకు మోటర్లు పెట్టేందుకు సంతకం పెట్టారని పేర్కొన్నారు. తొందరలోనే రాష్ట్రంలోని వ్యవసాయ కరెంట్ మోటార్లకు మీటర్లు వస్తాయని తెలిపారు. వీటిని ఎదుర్కొందామా.. మీటర్లు పెట్టకుండా యుద్ధం చేస్తామా అని పిలుపునిచ్చారు. రైతులు మంచిగుండాలి.. వ్యవసాయం మంచిగుండాలి.. పల్లెలు బాగుండాలి.. వృత్తి పనులు బాగుండాలనే కదా మనం అంటున్నామని కేసీఆర్ తెలిపారు. తమ ప్రభుత్వంలో యాదవులకు గొర్రెలు ఇప్పించామని.. ఇప్పుడొస్తున్నాయా అని ప్రశ్నించారు. మత్స్యకారుల కోసం చేప పిల్లలు పంపిణీ చేశామని.. ఇప్పుడు ఇస్తున్నారా అని అడిగారు. బీడీ కార్మికులు ఎవరూ అడగకుండానే.. పెన్షన్లు ఇచ్చామని గుర్తుచేశారు. భారతదేశంలో ఎవరైనా అలా ఇస్తారా అని ప్రశ్నించారు. కానీ కాంగ్రెసోళ్లు పెన్షన్లు పెంచుతామని ఎగ్గొట్టారని అన్నారు.

అదొక్కటే కాదని.. ఇంట్లో ఉన్న ఆడబిడ్డకు మహాలక్ష్మి అని రూ.2500 ఇస్తామని చెప్పారని.. ఇచ్చారా అని ప్రశ్నించారు. స్కూటీలు ఇచ్చారా అని అడిగారు. అలా ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏ ఒక్కటి ఇవ్వలేదని చెప్పారు. అసలు తెలంగాణలో ఏం జరుగుతుందని కేసీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంలో ప్రజల మంచిని కోరే ప్రతి ఒక్కరూ ఒక్కటి కావాల్సిందేనని పిలుపునిచ్చారు. మళ్లీ తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం ప్రారంభం కావాల్సిందేనని స్పష్టం చేశారు. దాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. పోరాటం చేయాల్సిందేనని.. వాళ్లను నిలదీయాల్సిందేనని అన్నారు. తెలంగాణ ప్రజలు గెలిచి నిలవాల్సిందేనని స్పష్టం చేశారు.

## ఈ ఎదవలు కేసీఆర్ చావాలంటే చస్తడా?

సీఎం రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు తనపై చేస్తున్న విమర్శలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పొద్దున లేస్తే కేసీఆర్ చావాలని అంటున్నారని.. నువ్వు వెయ్యి జన్మలెత్తినా నేను చావ.. ఏం అనుకుంటున్నావో అని మండిపడ్డారు. ఈ ఎదవలు చావాలంటే కేసీఆర్ చస్తాడా అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో చేశామని తెలిపారు. చెరువులను బందోబస్తు చేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని మిషన్ కాకతీయ చేపట్టామని పేర్కొన్నారు. రైతులు కూడా ఒక ఉద్యమంలా ఇందులో పాల్గొన్నారు. అక్కడి నుంచి మొదలుపెడితే పదేళ్లలో ఎన్నో చేశామని తెలిపారు. వట్టి మాటలు, గప్పాలు కొట్టుడు కాకుండా ఎన్నో చేశామని తెలిపారు. ఈ ఐదేళ్లలో మిషన్ భగీరథ కంప్లీట్ చేసి, ప్రతి ఇంటికి నల్లా పెట్టి మంచి నీళ్లు ఇవ్వకపోతే వచ్చే ఎన్నికల్లో నిలబడం, ఓట్లు అడగమని శాసనసభలో నిలబడి చెప్పిన ముఖ్యమంత్రి ఉన్నారా అని అడిగారు. నేను చెప్పి.. ఐదేళ్లలో మిషన్ భగీరథ నీళ్లు తెచ్చి మారుమూల పల్లెల్లకు కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. ఐదేళ్లు మిషన్ భగీరథ నీళ్లు పుష్కలంగా వచ్చాయని తెలిపారు. మరి ఇప్పుడు ఏం రోగం పుట్టిందని ప్రశ్నించారు. నీళ్లు రావాలంటే.. లాగులు పలిగేదాకా సంపాలని సూచించారు. మంచి మాటకు కాకపోతే అంతే చేయాలన్నారు. పొద్దున లేస్తే కేసీఆర్ సావాలని అంటాడని తెలిపారు. ' నువ్వు వెయ్యి జన్మలెత్తినా నేను చావ.. నా కొడకా ఏం అనుకుంటున్నావో' అని మండిపడ్డారు.

## నేటి అర్ధరాత్రి నుంచి బస్సులు బంద్!?

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసి కార్మికులను సన్నద్ధం చేశారు. అయితే సమ్మెకు దూరంగా ఉంటూ వచ్చిన మరో జేఏసీ (అశ్వథ్థామరెడ్డి వర్గం) సైతం తాము కూడా సమ్మెకు దిగుతున్నట్లుగా ప్రకటించింది. వీరితో సహా మిగతా కార్మిక సంఘాలు సైతం సమ్మెకే సై అంటున్నాయి. అదే జరిగితే తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఏం జరుగుతోందన్న టెన్షన్ చాలామందిని వెంటాడుతోంది. సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ రావాలన్నది ఆర్టీసీ జేఏసీ నేతల మాట. ప్రభుత్వంతో పలుమార్లు ఉద్యోగ సంఘాల నేతలు చర్చలు జరిగినప్పటికీ ఎలాంటి స్పష్టత రాలేదని.. అందుకే సమ్మె తప్ప వేరే గత్యం తరం లేదని జేఏసీ నేతలు చెబుతున్నారు. ఆర్టీసీ కార్మికులు కోరుతున్న డిమాండ్లలో మెజారిటీ అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రధాన డిమాండ్లు అయిన ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, యూనియన్ల పునరుద్ధరణ విషయంలోనే పేచి వస్తోంది. ఈ రెండు తమ పరిధిలో లేవని మంత్రి పొన్నం ప్రకటించిన తర్వాతే సమ్మెపై జేఏసీ స్పష్టమైన పిలుపునిచ్చింది. ఈ ప్రధాన డిమాండ్ల విషయంలో జేఏసీ నేతలు పట్టు వీడలేదు. అయితే, మంగళవారం చెన్నై నుంచి డిప్యూటీ సీఎం వచ్చాక ఆర్టీసీ కార్మికుల అంశంపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## వడ్డీతో సహా వసూలు

మొదటి పేజీ తరువాయి

తీర్పులో, అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద విధించిన సుంకాలను చెల్లవని ప్రకటించింది. ఆ సుంకాల కింద వసూలు చేసిన బిలియన్ డాలర్లు చట్టబద్ధం కాదని స్పష్టం చేసింది. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద రీఫండ్ ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఈ భారీ రీఫండ్ ప్రక్రియను సులభతరం చేయడానికి, యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీఏపీఈ) అనే కొత్త సిస్టమ్‌ను ప్రారంభించింది. ఈ వ్యవస్థ ద్వారా ఒక్కో దరఖాస్తుకు వేర్వేరుగా చెల్లింపులు చేయాల్సిన అవసరం ఉండదు. ఒకేసారి ఎలక్ట్రానిక్ చెల్లింపుల ద్వారా రీఫండ్ చేయనున్నారు. పాత విధానంతో పోలిస్తే వేగంగా డబ్బు తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది. అమెరికా ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం, 3 లక్షలకు పైగా దిగుమతిదారులు దాదాపు 166 బిలియన్ డాలర్లను టారిఫ్ రూపంలో చెల్లించారు. అర్హత ఉన్న దిగుమతిదారులకు వడ్డీతో కలిపి వాపసు చేయనున్నారు. దరఖాస్తు ఆమోదం తర్వాత 60-90 రోజుల్లో వాపసు జరుగుతుంది. అయితే, సాంకేతిక సమస్యల కారణంగా కొంత ఆలస్యం కూడా అవ్వొచ్చని నిపుణులు వెల్లడించారు.

# జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన 26 మందిలో 10 మంది తెలుగు విద్యార్థులే ఉండటం విశేషం. ఎన్‌టీఏ సోమవారం మధ్యాహ్నం ఫైనల్ ఆన్సర్ కీని విడుదల చేసి, సాయంత్రానికి ఫలితాలను ప్రకటించింది. విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్ వివరాలతో వెబ్‌సైట్‌లో స్కోర్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ రెండు సెషన్లలో కలిపి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 2.50 లక్షల మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 పరీక్ష రాసేందుకు అర్హత సాధించారు. ఈ పరీక్ష మే 17న జరగనుంది. అడ్వాన్స్‌డ్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఏప్రిల్ 23 నుంచి మే 4 వరకు కొనసాగుతుంది. ఈ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి దేశంలోని ప్రఖ్యాత ఐఐటీలలో ప్రవేశాలు లభిస్తాయి.

**100 పర్సంటైల్ సాధించిన తెలుగు విద్యార్థులు**

జొన్నల రోషన్ మణిదీప్ రెడ్డి (ఏపీ)
మంతా శివ కామేశ్ (తెలంగాణ)
నరేంద్ర బాబు గారి మహిత్ (ఏపీ)
తుంగ దుర్గ సుప్రభాత్ (ఏపీ)
డి. భవితేష్ రెడ్డి (తెలంగాణ)
పసల మోహిత్ (ఏపీ)
సాయి రిత్విక్ రెడ్డి (తెలంగాణ)
వివాన్ శరద్ మహిష్వరి (తెలంగాణ)
బిజ్జం వెంకట చంద్ర శేఖర్ రెడ్డి (ఏపీ)
రిషి ప్రేమ్‌నాథ్ (తెలంగాణ)

# ఢిల్లీలో హరీశ్ బృందం

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై బీఆర్ఎస్ త్రిసభ్య బృందం చర్చించనుంది. ఒకవేళ హైకోర్టులో తీర్పు వ్యతిరేకంగా వస్తే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసే అవకాశం ఉంది. దీనిపై కూడా న్యాయవాదులతో చర్చించారు.

# కేజ్రీవాల్ రీక్యూసల్ పిటిషన్ కొట్టేవేత

మొదటి పేజీ తరువాయి

రాయడం మొదలు పెట్టినప్పుడు కోర్టుగది నిశ్శబ్దంగా మారిపోయింది. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసిన న్యాయమూర్తిపై ఎంత గురుతర బాధ్యత ఉంటుందో ఇది చెబుతోంది. దటీజ్ భారత్. ఇది ఒకరకంగా నాకు పరీక్ష. నేను తప్పుకుంటే ఆరోపణల్లో నిజం ఉందంటారు. తప్పుకోకుండా వ్యతిరేకంగా తీర్పు ఇస్తే పక్షపాతం అంటారు. నేను ఈ ఉచ్చులో పడను' అని స్వరణ్ కాంత్ శర్మ వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, రాజకీయ నాయకులు బహిరంగంగా చేసే వ్యాఖ్యలు కోర్టు నిర్ణయాలను ప్రభావితం చేయలేవని, వాటిని సాక్ష్యాలుగా పరిగణించలేమని జస్టిస్ స్వరణ్ కాంత్ శర్మ స్పష్టం చేశారు. రాజకీయ నాయకుడి భార్య, పిల్లలు రాజకీయాల్లోకి వచ్చినప్పుడు, ఒక జడ్జి పిల్లలు న్యాయవాద వృత్తిలోకి రాకూడదని ఎలా చెబుతారు? ఇది న్యాయమూర్తుల కుటుంబానికి ఉన్న హక్కులను లాక్కోవడం కాదా? అని ఆమె ప్రశ్నించారు.

# కేసీఆర్ గురి జీహెచ్ఎంసీ

**మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా వ్యాఖ్యలు**

**అందులో భాగంగానే హైడ్రా పేరు తెరపైకి**

**(ఈవార్తలు-పొలిటికల్ బ్యూరో)**






ఏడాది కాలం తర్వాత బహిరంగ సభలో ప్రత్యక్షమైన కేసీఆర్, జగిత్యాల గడ్డపై నుంచి అధికార పక్షంపై నేరుగా యుద్ధం ప్రకటించారు. అయితే ఆయన ప్రసంగంలో ప్రధానంగా వినిపించిన 'హైడ్రా రద్దు' నినాదం వెనుక లోతైన విశ్లేషణ ఉంది. మూసీ పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న కూల్చివేతలు, హైడ్రా చర్యల వల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, తాము అధికారంలోకి రాగానే చేసే తొలి సంతకం ఈ వ్యవస్థ రద్దుపైనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవనం పేరుతో పేదల ఇళ్లను కూల్చడాన్ని కేసీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దాదాపు 10,000 ఇళ్లను కూల్చడం వెనుక హేతుబద్ధత ఏమిటని ప్రశ్నిస్తూ, బాధితుల్లో భరోసా నింపే ప్రయత్నం చేశారు. మూసీ పునరుజ్జీవనం పేరుతో చేపట్టిన ప్రాజెక్టు కేవలం కొందరు వ్యక్తుల రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమేనని కేసీఆర్ విమర్శించారు. పేదలను ఇబ్బందులకు గురిచేయడం వెనుక పెద్ద కుట్ర ఉందని ఆరోపించారు. గత పదేళ్లలో కష్టపడి నిర్మించిన వ్యవస్థలను ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకునే పిల్లల పుస్తకాలు కూడా తీసుకోవనివ్వకుండా ఇళ్లను కూల్చడం ఏ రకమైన పాలన అని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ పరిధిలో హైడ్రా చర్యలు గందరగోళం సృష్టిస్తున్న తరుణంలో, ఆ ప్రభావం రాబోయే నగరపాలక ఎన్నికలపై స్పష్టంగా ఉంటుందని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవడమే కేసీఆర్ లక్ష్యంగా కనిపిస్తోంది. హైదరాబాద్ నగర శివార్లలో, చెరువుల పరివాహక ప్రాంతాల్లో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసిన ఇళ్లు ఇప్పుడు హైడ్రా గుప్పిట్లో ఉన్నాయి. కూల్చివేతల భయంతో ఉన్న ఈ వర్గాలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా, గత ఎన్నికల్లో కోల్పోయిన నగర పట్టును తిరిగి సాధించాలని కేసీఆర్ భావిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా (హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి) విభజించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ విభజన వల్ల అధికార పార్టీకి రాజకీయ లబ్ధి చేకూరుతుందని భావిస్తుండగా, కేసీఆర్ మాత్రం హైడ్రా మరియు మూసీ ప్రాజెక్టు వల్ల ఏర్పడిన ప్రజా వ్యతిరేకతను ఏకీకృతం చేసి, మూడు ప్రాంతాల్లోనూ బీఆర్ఎస్ పట్టు నిలుపుకోవాలని చూస్తున్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో వేలాది ఇళ్లను తొలగిస్తామన్న ప్రభుత్వ ప్రకటనపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు కేసీఆర్ అండగా నిలవడం ద్వారా, కాంగ్రెస్‌కు పట్టున్న పాతబస్తీ సరిహద్దులు మరియు ఇతర కీలక డివిజన్లలో చీలిక తెచ్చే అవకాశం ఉంది. నగర రాజకీయాల్లో ఎంఐఎం పాత్ర కీలకం. ఒకవేళ కాంగ్రెస్-ఎంఐఎం దోస్తీ బలపడితే, దాన్ని ఎదుర్కోవడానికి కేసీఆర్ 'హైడ్రా బాధితుల పక్షపాతి'గా ముద్ర వేసుకోవడం ద్వారా ఒక కొత్త సామాజిక సమీకరణాన్ని సృష్టిస్తున్నారు. కూల్చివేతలు, ఆక్రమణల విషయంలో సాధారణంగా బీజేపీ చేసే పోరాటాలను కేసీఆర్ తన భుజానికెత్తుకోవడం ద్వారా, నగరంలో ప్రధాన ప్రతిపక్ష పాత్రను బీఆర్ఎస్ మాత్రమే పోషించగలదని సంకేతాలిచ్చారు. ఇది నగరంలోని ఫ్లోటింగ్ ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతలు పార్టీలో చేరడంతో ఉత్తర తెలంగాణలో పట్టు పెంచుకుంటూనే, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేకతను కూడగట్టేందుకు ఈ సభను ఒక వేదికగా మలుచుకున్నారు. ప్రభుత్వ పథకాలైన రైతు బంధు, దళిత బంధు నిలిపివేతను ప్రస్తావిస్తూనే, హైడ్రాను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా కేసీఆర్ తన రాజకీయ పునరాగమనాన్ని పక్కా ప్రణాళికతో చాటుకున్నారు. ఒకవైపు నగర ఓటర్లను, మరోవైపు సామాన్య వర్గాలను ఆకర్షించడమే ఈ 'తొలి సంతకం' హామీ వెనుక ఉన్న అసలు రహస్యం. మరి ఈ వ్యూహం జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# హేమ్లా విజ్జ సరెండర్!

**23 మందితో కలిసి త్వరలో లొంగుబాటు**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఈవార్తలు): మావోయిస్టు పార్టీ కీలక నేత, పీఎల్‌జీఏ బెటాలియన్-1 లో మిగిలిన చివరి కమాండర్ హేమ్లా విజ్జ అలియాస్ ఐతు సరెండర్ కాబోతున్నట్లు తెలుస్తోంది. తనతో పాటు మరో 23 మందితో కలిసి లొంగిపోయేందుకు ఆయన తెలంగాణకు చేరుకుని పోలీసుల టచ్‌లోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. మరో రెండు రోజుల్లో వీరంతా పోలీసుల సమక్షంలో లొంగిపోబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సరెండర్ తో గత రెండు దశాబ్దాలుగా దక్షిణ బస్తర్ అడవుల్లో భద్రతా దళాలకు సవాల్‌గా మారిన పీఎల్‌జీఏ బెటాలియన్-1 దాదాపుగా తుడిచిపెట్టుకుపోయినట్లేనని అధికారులు భావిస్తున్నారు. హేమ్లా విజ్జ (ఐతు) డివిజనల్ కమిటీ మెంబర్‌గా వ్యవహరిస్తూ, పీఎల్‌జీఏ మిలిటరీ వింగ్ ఇంచార్జ్‌గా, ప్లాటూన్ నం. 09/10 బాధ్యతలను చూస్తున్నారు. పీఎల్‌జీఏ బెటాలియన్-1, ఎస్బీడీ మధ్య బలమైన వారధిగా, సప్లై టీమ్ ఇంచార్జ్‌గా కీలక పాత్ర పోషించారు. గత 20 ఏళ్లుగా దక్షిణ బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాలపై జరిగిన పలు భారీ దాడుల్లో ఇతను ప్రధాన సూత్రధారిగా ఉన్నారు. 2004లో ఏర్పాటైన పీఎల్‌జీఏ బెటాలియన్-1, దక్షిణ బస్తర్‌లో అత్యంత శక్తివంతమైన మిలిటరీ విభాగంగా నిలిచింది. గత రెండు దశాబ్దాల కాలంలో భద్రతా దళాలకు అత్యధిక ప్రాణనష్టం కలిగించిన విభాగం కూడా ఇదే. ఇటీవల పీఎల్‌జీఏ డిప్యూటీ కమాండర్ సోది కేశాలు అలియాస్ మల్లాతో పాటు 42 మంది మావోయిస్టులు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట తమ ఆయుధాలతో లొంగిపోయారు. తాజాగా మిలిటరీ వింగ్ ఇంచార్జ్ హేమ్లా విజ్జ కూడా సరెండర్ కాబోతుండటంతో ఈ బెటాలియన్ పూర్తిగా నిర్వీర్యమైందని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఈ లొంగుబాటుకు సంబంధించిన అధికారిక ప్రకటన 2 లేదా 3 రోజుల్లో తెలంగాణ పోలీసులు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# నా శేష జీవితం కేసీఆర్ నాయకత్వంలోనే

## జగిత్యాల సభలో జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 20 (ఈవార్తలు): బీఆర్ఎస్ సభ చరిత్రలో నిలిచిపోతుందని సీనియర్ నేత జీవన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో చెప్పిందేంటి? ఇప్పుడు చేస్తున్నదేంటి అని ప్రశ్నించారు. హైడ్రా పేరిట భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ తీరుపై ప్రజలు నైరాశ్యంలో ఉన్నారని జీవన్ రెడ్డి అన్నారు. నా శేష జీవితం కేసీఆర్ నాయకత్వంలోనే గడుస్తుందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి అధిష్ఠానం అంటే కాంగ్రెస్ కాదని.. మోదీ అని అన్నారు. కేసీఆర్ హయాంలోనే రీజినల్ రింగ్ రోడ్డు మంజూరైందని తెలిపారు. మెట్రో విస్తరణపై రేవంత్ రెడ్డి ఎందుకు ముందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. వంత్ రెడ్డి ప్రజల కోసం పనిచేయడం లేదని.. తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే పనిచేస్తున్నారని జీవన్ రెడ్డి విమర్శించారు. మేడిగడ్డతోనే తెలంగాణ రైతాంగానికి మేలు జరుగుతుందని జీవన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మేడిగడ్డ రిపేర్ చేయాల్సింది అని అభిప్రాయపడ్డారు. రిపోర్టు వచ్చి ఏడాదైనా పట్టించుకోకుండా గుడ్డి గుర్రం పళ్లు తోముతున్నారా అని మండిపడ్డారు. ఇప్పుడు మేడిగడ్డ వచ్చి సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తారని నిలదీశారు. పంట నాట్లు వేసే సమయంలో పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట కోతకు వచ్చే సమయానికి కూడా రైతు భరోసా డబ్బులు వేయడం లేదని మండిపడ్డారు. పంట బీమా పథకం ఏమైందని ప్రశ్నించారు.

### 20 నెలలు నా ఉసురు పోసుకున్నారు

క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యందించి అండగా ఉన్నారని తెలిపారు. నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని అన్నారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలోనే కేసీఆర్ తనను పార్టీలోకి ఆహ్వానించారని జీవన్ రెడ్డి తెలిపారు. కానీ క్రమశిక్ష కలిగిన వ్యక్తిగా కాంగ్రెస్‌లోనే కొనసాగానని పేర్కొన్నారు. ఉద్యమ రథసారథిగా కేసీఆర్ తెలంగాణ సాధించారని అన్నారు. అలాంటి వ్యక్తితో పనిచేసే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కల్యాణలక్ష్మీ పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కానీ ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. బోర్నపల్లి నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాను చేసిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. కేసీఆర్ జగిత్యాలకు మెడికల్ కాలేజీ ఇచ్చారని తెలిపారు. వైద్య సేవలను విస్తరించారని పేర్కొన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజనులకు రిజర్వేషన్లను కూడా పెంచారని అన్నారు.

# హరీశ్ భవిష్యత్తు అంధకారం

**మానసిక వేధనతో బాధపడుతున్నారు**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శలు**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఈవార్తలు): బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిప్పులు చెరిగారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు వ్యవస్థలను దోచుకుని రాష్ట్రాన్ని రావణకాష్ఠంగా మార్చారని ఆరోపించారు. హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు అంధకారంలో ఉందని, అందుకే ఏం చేయాలో దిక్కుతోచక పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. "హరీశ్ రావు ప్రస్తుతం మానసిక వేదనతో బాధపడుతున్నారు. గతంలో ఆయనకు జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అవమానాల వల్లే ఆయన స్థితి ఇలా తయారైంది" అంటూ తుమ్మల వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎక్కడికి వెళ్లినా ఒకే ఆవు కథ, ఒకే రికార్డింగ్ క్యాసెట్ వినిపించడం హరీశ్ రావుకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే హక్కు లేదని తుమ్మల అన్నారు. ఈ ప్రాజెక్టు తన రాజకీయ ఆకాంక్ష అని, దీనిని పూర్తి చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేంద్ర అనుమతులు లేకుండా రూ. 8 వేల కోట్లు ఖర్చు చేసిందని, కేవలం కమీషన్ల కోసమే లోపభూయిష్టమైన డిజైన్లతో పనులు చేపట్టారని ఆరోపించారు. హెడ్ వర్క్స్ లిఫ్ట్ కూడా పూర్తి చేయలేని స్థితిలో బీఆర్ఎస్ పాలన సాగిందని మండిపడ్డారు.

# చిన్నారిని పీక్కుతిన్న వీధికుక్కలు

పెద్దపల్లి, ఏప్రిల్ 20 (ఈవార్తలు): పెద్దపల్లి జిల్లాలో దారుణం జరిగింది. జిల్లాలోని సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో వీధికుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. దివ్యా బెహ్రా అనే బాలిక తమ ఇంటి ముందు వీధిలో ఆడుకుంటోంది. ఈ సమయంలో బాలికపై కుక్కలు దాడి చేశాయి. కుక్కలు బాలికను నోట కరుచుకుని పొలాల్లోకి తీసుకువెళ్లాయి. ఈ క్రమంలో కుక్కలు పీక్కుతినడంతో తీవ్రగాయాలతో చిన్నారి మృతి చెందింది.

# పార్టీ ఫిరాయింపులకు బీజం వేసింది మీరే

**కేటీఆర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సంజయ్ నిప్పులు**

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఉద్దేశించి చేసిన 'క్రాస్ బ్రీడ్, హైబ్రీడ్' వ్యాఖ్యలపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ. .. అసలు రాష్ట్రంలో ఫిరాయింపుల సంస్కృతిని మొదలుపెట్టింది ఎవరో ప్రజలకు బాగా తెలుసని ఎద్దేవా చేశారు. గత పదేళ్లలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోవడం 'నీతి' అయినప్పుడు... ఇప్పుడు తాము వేరే పార్టీకి దగ్గరైతే 'అవినీతి' ఎలా అవుతుందని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి నడుస్తున్నానని, జగిత్యాల జిల్లాకు గతంలో ఎవరు ఏం చేశారో లెక్కలు తీయడానికి తాను సిద్ధమని సవాల్ విసిరారు. వచ్చే 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున మళ్లీ జగిత్యాల నుంచే పోటీ చేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))


| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines - Rs.450
(for each extra line - Rs.90)

COLOUR:
Price for 5 Lines - Rs.500
(for each extra line - Rs.100)

Phone: +91 94404 55811   Email: contact@evarthalu.com





# కొండగట్టు అంజన్న జన్మోత్సవాలకు ఏర్పాట్లు

మల్యాల, ఏప్రిల్ 20 (ఈవార్తలు): కొండగట్టు అంజన్న ఆలయంలో మే నెల 11, 12, 13 తేదీలలో వైభవంగా నిర్వహించనున్న అంజన్న జన్మోత్సవ (పెద్ద జయంతి) ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో ఎస్ అంజనారెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం ఆయన ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీటి సదుపాయం, క్యూ లైన్‌ల ఏర్పాటు, మరుగుదొడ్లు, శానిటేషన్ చర్యలు, ప్రసాదం సరఫరా వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, స్థానాచారి కపిందర్, ముఖ్య అర్చకులు లక్ష్మణ్ చారి, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సేవలో కాంగ్రెస్ సర్కారు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఏప్రిల్ 20 (ఈవార్తలు): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. సోమవారం గంగాధర మండలం మధురానగర్ లో హాక నిర్వాహకుడు జాగిరపు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హాక ఫార్మర్స్ సర్వీస్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల మాదిరిగానే హాక సర్వీస్ సెంటర్లో కూడా వ్యవసాయ సేవలు అందుతాయని తెలిపారు. రైతులు హాక సర్వీస్ సెంటర్లను వినియోగించుకొని వ్యవసాయ సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్,సర్పంచ్లు సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచ్లు,కాడరి రేణుక కనుకయ్య,వేముల భాస్కర్,రెండ్ల శ్రీనివాస్,బాస వేణి శ్రీనివాస్,తూం రాజు, సత్తు కనుకయ్య, సాగి అజయ్ రావు,మేర్జ కొండయ్య, ప్రేమ్ కుమార్, మంత్రి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## 56.39 కోట్ల సీఎంఆర్ఎఫ్ రిలీజ్

### పుట్టినరోజు నాడు కీలకమైన ఫైలు బాబు సైన్

అమరావతి, ఏప్రిల్ 20 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన పుట్టినరోజు సందర్భంగా ఒక కీలకమైన ఫైలుపై సంతకం చేసి, పేదల పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.56.39 కోట్లను విడుదల చేస్తూ ఆయన ఆమోదముద్ర వేశారు. ఈ నిర్ణయంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొంది, ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న 7,074 మందికి లబ్ధి చేకూరనుంది. ఉగాది, నూతన సంవత్సరం వంటి ప్రత్యేక సందర్భాల్లో పేదలకు మేలు చేసే కార్యక్రమంతోనే తన దినచర్యను ప్రారంభించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు సంప్రదాయం. ఈ పుట్టినరోజున కూడా ఆయన అదే పద్ధతిని కొనసాగించారు. ఉదయం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న అనంతరం, ఆయన నేరుగా అన్నా క్యాంటీన్‌కు వెళ్లి అక్కడ పేదలతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం, గన్నవరం విమానాశ్రయానికి వెళ్లే మార్గమధ్యంలో చంద్రబాబు ఈ కీలక ఫైలుపై సంతకం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత 22 నెలల కాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా 1,43,314 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1,298.33 కోట్ల ఆర్థిక సాయం అందించడం గమనార్హం.

## 100 జన్మలెత్తినా అమరావతి పూర్తి కాదు: అంబటి

తాడేపల్లి, ఏప్రిల్ 20 (ఈవార్తలు): రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడుస్తున్నా ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధాని లేకపోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కారణమని అంబటి రాంబాబు విమర్శించారు. రాజధాని నిర్మాణం పేరుతో కేవలం అవినీతి, కమీషన్ల కోసమే అమరావతిని వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రం నిధులిచ్చినా శాశ్వత భవనాలు కట్టకుండా, తాత్కాలిక కట్టడాలతో కాలక్షేపం చేశారని మండిపడ్డారు. "అమరావతి అనేది ఎప్పటికీ పూర్తికాని ఒక అంతులేని కథ. ఎద్దేవా చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు 'మూడు రాజధానుల' ద్వారా అభివృద్ధిని వికేంద్రీకరించాలని చూస్తే, చంద్రబాబు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని అడ్డుకున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం అమరావతి అంశాన్ని నాన్చుతున్నారని దుయ్యబట్టారు.

# డీఎంకే నిర్ణయంతో దక్షిణాదికి నష్టం

### కోయంబత్తూరులో చంద్రబాబు

కోయంబత్తూర్: మహిళా రిజర్వేషన్ బిల్లు, డీ-లిమిటేషన్ బిల్లులను వ్యతిరేకించడం ద్వారా కాంగ్రెస్, డీఎంకే సహా ఇండియా కూటమి పార్టీలు మహిళలను ఓడించాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమిళనాడులోని కోయంబత్తూరులో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఈ బిల్లులను తీసుకొస్తే, కేవలం సంకుచిత రాజకీయాల కోసం డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు వాటిని అడ్డుకున్నాయని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "మహిళా రిజర్వేషన్ల బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్, డీఎంకే పార్టీలు మహిళలకు తీరని ద్రోహం చేశాయి. ఈ బిల్లును ఎందుకు వ్యతిరేకించాల్సి వచ్చిందో డీఎంకే ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ నిర్ణయంతో ఇండియా కూటమి ఓడించింది ఎన్డీఏను కాదు, దేశంలోని మహిళలను. దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళల ఆకాంక్షలను ఈ పార్టీలు ఎందుకు గుర్తించడం లేదు?" అని ప్రశ్నించారు. మహిళల కోసం తాను చాలా కాలంగా పోరాడుతున్నానని, 2029 ఎన్నికల నాటికే ఈ రిజర్వేషన్లు అమలు కావాలని ప్రధాని మోదీ భావించారని గుర్తు చేశారు. డీ-లిమిటేషన్ బిల్లు ప్రాముఖ్యతను వివరిస్తూ.. "కేంద్రం ప్రతిపాదించిన ఈ బిల్లు వల్ల తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్లు గణనీయంగా పెరిగి, రాజకీయ ప్రాతినిధ్యం మెరుగయ్యేదని ఆయన వివరించారు. 50 శాతం సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెబుతుంటే డీఎంకే ఎందుకు అడ్డుకుంది? దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగాలని డీఎంకే కోరుకుంటోందా? డీఎంకే తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మహిళలు, దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయాయి" అని చంద్రబాబు అన్నారు. 2027 సెన్సస్ ప్రకారం డీ-లిమిటేషన్ చేపడితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు ప్రభుత్వ పాలనపై కూడా ఆయన విమర్శలు చేశారు. ఒకప్పుడు ప్రగతిశీల రాష్ట్రంగా ఉన్న తమిళనాడు, ఇప్పుడు ఆర్థికంగా వెనుకబడిందని, రాష్ట్రంలో అనేక కుంభకోణాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు.

# లోకేశ్.. ఏనాడైనా అమ్మమ్మా అని వచ్చావా?

### నారా కుటుంబంపై లక్ష్మీపార్వతి విమర్శలు

విజయవాడ, ఏప్రిల్ 20 (ఈవార్తలు): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా వైసీపీ నేత లక్ష్మీపార్వతి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, మంత్రి లోకేశ్ లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా కుటుంబ చరిత్ర మొత్తం మోసాలతో కూడుకున్నదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కన్నతండ్రి ఎన్టీఆర్‌పై చెప్పులేసి అవమానిస్తుంటే భువనేశ్వరి ఎందుకు నోరు మెదపలేదని ఆమె ప్రశ్నించారు. "లోకేశ్.. నీ స్థాయి ఎంత? జగన్ ముందు నువ్వు ఎంత?" అని ప్రశ్నించారు. ఈవీఎంల మేనేజ్‌మెంట్‌తోనే లోకేశ్ గెలిచారని ఆరోపించారు. "ఏనాడైనా మీ మేనత్తలు మీ ఇంటికి వచ్చారా? మీ అమ్మకు వారంటే అయిష్టం. అసలు వారు ఎక్కడ ఉన్నారో నీకు తెలుసా?" అంటూ వ్యక్తిగత విమర్శలకు దిగారు. ఏనాడైనా అమ్మమ్మా అంటూ నా దగ్గరకు వచ్చావా? అసలు నా పుట్టిన రోజు ఎప్పుడో నీకు తెలుసా? అని ప్రశ్నించారు. అన్ని పార్టీల్లోనూ తన మనుషులను పెట్టుకుని చంద్రబాబు అడ్డదారుల్లో రాజకీయాలు చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీలో, కాంగ్రెస్ లో, చివరకు కమ్యూనిస్టుల్లో కూడా చంద్రబాబే ఉన్నారని విమర్శించారు. గత వైసీపీ హయాంలో మహిళల సంక్షేమం కోసం జగన్ చేసిన కృషిని లక్ష్మీపార్వతి కొనియాడారు. 35 లక్షలకు పైగా ఇళ్ల పట్టాలు ఇచ్చి మహిళా సాధికారతకు బాటలు వేశారని, నిజమైన నాయకుడు అంటే జగన్ లా ఉండాలని పేర్కొన్నారు.

# ఏపీ ఉద్యోగి వెంకట్రామిరెడ్డి డిస్మిస్

### న్యాయస్థానంలో తేల్చుకుంటానని వెల్లడి

విజయవాడ, ఏప్రిల్ 20 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డిపై కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో సర్వీస్ నిబంధనలను బేఖాతరు చేస్తూ వైసీపీ అభ్యర్థుల తరపున బహిరంగంగా ప్రచారం నిర్వహించారనే ఆరోపణలతో ఆయన్ను ఉద్యోగం నుండి తొలగిస్తూ (డిస్మిస్) సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం తీవ్రమైన క్రమశిక్షణారాహిత్యం కిందకు వస్తుందని, దీనిపై జరిగిన విచారణ అనంతరం ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయంతో ఆయన కేవలం ఉద్యోగాన్ని మాత్రమే కాకుండా, తనకు లభించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్లు, పెన్షన్ ప్రయోజనాలను కూడా పూర్తిగా కోల్పోతారని తెలుస్తోంది. కాగా, తనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తీవ్రంగా ప్రతిస్పందించారు. ప్రభుత్వం తనను అడ్డగోలుగా డిస్మిస్ చేసిందని, దీనిపై న్యాయస్థానంలో తేల్చుకుంటానని ఆయన స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా సస్పెన్షన్‌లో ఉన్నానని, తనకు ఇంకా 14 ఏళ్ల సర్వీస్ మిగిలి ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ఎన్నికల్లో తాను వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేశానన్న ఆరోపణలను ఆయన ఖండించారు. తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు కనీస ఆధారాలు కూడా లేవని... కేవలం ఉద్యోగ సంఘం నాయకుడిగా ప్రశ్నిస్తున్నాననే కారణంతోనే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. 2014-19 మధ్య కాలంలో కూడా పలువురు ప్రభుత్వ వారిపై ఇలాంటి డిస్మిస్ చర్యలు ఎప్పుడూ తీసుకోలేదని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు.



# నన్ను 'ప్లేయర్' అనేవారు

### చీర లాగారు, అసభ్యకరంగా తాకారు

### టీసీఎస్ ఉద్యోగిని ఆవేదన

నాసిక్: ప్రముఖ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ కార్యాలయంలో తీవ్ర కలకలం రేగింది. కొత్తగా పెళ్లయిన ఓ మహిళా ఉద్యోగినిపై సహోద్యోగులు లైంగిక వేధింపులకు పాల్పడటంతో పాటు మత మార్పిడికి ఒత్తిడి చేశారన్న ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ కేసులో నాసిక్ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి, ఒక మహిళా ఆపరేషన్స్ మేనేజర్‌తో సహా 8 మందిని అరెస్ట్ చేశారు. ఇప్పటివరకు మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వివరాల్లోకి వెళితే... పుణేలో భర్త ఉద్యోగం చేస్తుండటంతో బాధితురాలు నాసిక్‌లో అత్తమామలతో కలిసి ఉంటోంది. ఆమె 2025 జూన్ 20న నాసిక్‌లోని టీసీఎస్ బ్రాంచ్‌లో అసోసియేట్‌గా చేరారు. శిక్షణ సమయంలో టీమ్ లీడర్ రజా మెనన్, ట్రైనింగ్ లీడర్ షారుఖ్ ఖురేషి తనను వ్యక్తిగత విషయాలు అడుగుతూ వేధించడం ప్రారంభించారని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. "భర్త దూరంగా ఉంటున్నాడు కదా, ఒంటరిగా ఎలా ఉంటున్నావ్? నీకు బాయ్‌ఫ్రెండ్స్ ఉండొచ్చు కదా?" అంటూ అసభ్యంగా మాట్లాడేవారని ఆరోపించారు. రజా తనను "ప్లేయర్" అని పిలుస్తూ, ఆఫీసులో అందరి ముందూ అవమానించేవాడని బాధితురాలు వివరించింది. తన పనితీరు గురించి ప్రశ్నిస్తూ, "పని చేతకాకపోతే చెప్పు" అంటూ చులకన చేసేవాడని తెలిపింది. ఈ ఏడాది మార్చిలో గుడి పడ్వా రోజున తాను చీర కట్టుకుని ఆఫీసుకు వెళ్లగా, రజా తన చీర కొంగు పట్టుకుని లాగాడని, అసభ్యంగా చూస్తూ నవ్వాడని ఆమె వాపోయింది. శిక్షణ పూర్తయ్యాక, మరో టీమ్‌లోని ఆసిఫ్ అన్సారీ అనే ఉద్యోగి వేధింపులు మొదలుపెట్టాడని ఆమె పేర్కొంది. కూర్చునే ఖాళీ లేకపోయినా పక్కనే కూర్చుని ఉద్దేశపూర్వకంగా శరీరాన్ని తాకడం, చేతులు




పట్టుకోవడం, తొడపై, భుజంపై చేయి వేయడం వంటివి చేసేవాడని చెప్పింది. "నీది జీరో ఫిగర్" అంటూ తన శరీరంపై వ్యాఖ్యలు చేశాడని, ఒకసారి గట్టిగా కౌగిలించుకోగా, తాను అతడిని తోసేసి పారిపోయానని వివరించింది. హిందూ దేవుళ్లపై కూడా ఆసిఫ్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని, అభ్యంతరం తెలిపితే ఉద్యోగంలో ఇబ్బందులు పెడతానని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొంది.

### స్పందించిన టీసీఎస్, ప్రభుత్వం

ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తీవ్రంగా స్పందించారు. ఇది "కార్పొరేట్ జిహాద్" అనిపిస్తోందని, చాలా తీవ్రమైన విషయమని అన్నారు. మరోవైపు టీసీఎస్ యాజమాన్యం ఈ ఆరోపణలపై స్పందిస్తూ, తమ సంస్థలో ఎలాంటి వేధింపులను సహించేది లేదని స్పష్టం చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను సస్పెండ్ చేశామని, అంతర్గత విచారణ కోసం ఓ పర్యవేక్షణ కమిటీని, బయటి సంస్థలను నియమించినట్లు ప్రకటించింది. అయితే, నిందితుడు రజా మెనన్ కుటుంబ సభ్యులు ఈ ఆరోపణలను ఖండించారు. వృత్తిపరమైన అసూయ, ఆఫీస్ రాజకీయాల వల్లే తమ కుమారుడిపై తప్పుడు కేసులు పెట్టారని, ఇదొక కుట్ర అని వారు ఆరోపించారు. ప్రస్తుతం ఈ కేసుపై సిట్ బృందం లోతుగా దర్యాప్తు చేస్తోంది.

## లెబనాన్‌లో క్రీస్తు విగ్రహం ధ్వంసం

### ఇజ్రాయెల్ సైనికుడిపై క్రిమినల్ విచారణ

జెరూసలేం: దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనికుడొకరు ఏసుక్రీస్తు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా స్పందించారు. ఈ చర్యను అత్యంత కఠినమైన పదజాలంతో ఖండిస్తున్నానని, ఈ ఘటన గురించి తెలిసి తాను దిగ్భ్రాంతికి, విచారానికి గురయ్యానని సోమవారం ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై సైనిక అధికారులు క్రిమినల్ విచారణ జరుపుతున్నారని, బాధ్యుడైన సైనికుడిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారని నెతన్యాహు తెలిపారు. లెబనాన్‌లో ఓ సైనికుడు సుత్తితో ఏసుక్రీస్తు విగ్రహాన్ని పగలగొడుతున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ప్రకటన వెలువడింది. ఈ ఘటనపై ఆదివారమే స్పందించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్), ఇది తమ విలువలకి పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేసింది. సైనికుడి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని, ఈ ఉదంతంపై నార్తర్న్ కమాండ్ దర్యాప్తు చేస్తోందని పేర్కొంది. "యూదు దేశంగా ఇజ్రాయెల్ అన్ని మతాల పట్ల సహనానికి, పరస్పర గౌరవానికి కట్టుబడి ఉంది. మధ్యప్రాచ్యంలోని ఇతర దేశాలతో పోలిస్తే ఇజ్రాయెల్‌లో క్రైస్తవ జనాభా వృద్ధి చెందుతోంది. ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాం" అని నెతన్యాహు తన ఎక్స్ (ట్విట్టర్) పోస్టులో వివరించారు. ధ్వంసమైన విగ్రహాన్ని పునరుద్ధరించేందుకు స్థానిక సమాజానికి సహాయం అందిస్తామని కూడా ఐడీఎఫ్ హామీ ఇచ్చింది. హెజ్బొల్లా ఉగ్రవాద నెట్‌వర్క్‌ను కూల్చివేయడమే తమ లక్ష్యమని, మతపరమైన కట్టడాలను ధ్వంసం చేయడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేసింది.

## విజయ్ అఫిడవిట్లలో తేడాలు

### మద్రాస్ హైకోర్టు నోటీసులు జారీ

చెన్నై: 2026 తమిళనాడు శాసనసభ ఎన్నికల కోసం తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రకటించిన ఆస్తులలో అవకతవకలు ఉన్నాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన మద్రాస్ హైకోర్టు ఆయనకు



నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఏ. ధర్మాధికారి, జస్టిస్ జి. అరుల్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం, విజయ్‌కు, ఆదాయపు పన్ను డైరెక్టర్ జనరల్, భారత ఎన్నికల సంఘం, పెరంబూర్ మరియు తిరుచిరాపల్లి (తూర్పు) నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు నోటీసులు జారీ చేసింది. విజయ్ తిరుచ్చి, పెరంబూర్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. విజయ్ రెండు నియోజకవర్గాల్లో సమర్పించిన అఫిడవిట్‌లలో తేడాలు ఉన్నాయంటూ చెన్నైకి చెందిన విఘ్నేష్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పెరంబూర్‌లో సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను రూ.115 కోట్లుగా, తిరుచ్చిలో సమర్పించిన అఫిడవిట్‌లో రూ.220 కోట్లుగా పేర్కొన్నారని పేర్కొన్నారు. ఇంత తేడా ఎందుకు చూపించవలసి వచ్చిందో వివరించేలా ఎలాంటి అనుబంధ పత్రాన్ని విజయ్ ఇవ్వలేదని తెలిపారు.

# ప్రధాని మోదీతో శాంసంగ్ చైర్మన్ సెల్ఫీ

### నోయిడాలోని శాంసంగ్ ఫెసిలిటీలో ఆసక్తికర ఘటన

నోయిడా: శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లీ జే యోంగ్ భారత పర్యటనలో ఉన్న దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్, ప్రధాని నరేంద్ర మోదీలతో కలిసి సెల్ఫీ దిగారు. సోమవారం నోయిడాలోని శాంసంగ్ తయారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర విందు సందర్భంగా ఈ ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. ఇరు దేశాల నేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా, భారత్‌లో శాంసంగ్ స్థానిక తయారీ సామర్థ్యాలను చాటిచెప్పారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ భారత్, వియత్నాం దేశాల పర్యటనలో భాగంగా భారీ వ్యాపార ప్రతినిధి బృందంతో కలిసి వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా జరిగిన కొరియా-ఇండియా బిజినెస్ ఫోరంలో హ్యుందాయ్, ఎస్కే గ్రూప్, ఎల్జీ సంస్థల అధినేతలతో సహా సుమారు 250 మంది కొరియా వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. 1996 నుంచి శాంసంగ్ తన నోయిడా ప్లాంట్‌లో బడ్జెట్ మోడల్స్ నుంచి ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్‌ల వరకు తయారుచేస్తోంది. తన మూడు రోజుల పర్యటనలో భాగంగా, దక్షిణ కొరియా



అధ్యక్షుడు ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. "మహాత్మా గాంధీ శాంతి స్ఫూర్తి ప్రపంచాన్ని శాంతితో నింపాలని ఆశిస్తూ, నేను కూడా అందుకు సంయుక్తంగా కృషి చేస్తాను" అని లీ పేర్కొన్నారు. శాంతి, ప్రజాస్వామ్యం పునాదులపై ఇరు దేశాలు ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు.

### అన్ని రంగాల్లో దక్షిణ కొరియాతో దోస్తీ: మోదీ

నోయిడా: ప్రతి రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారతదేశానికి వచ్చారు. ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా ప్రధాని మోదీ, లీ జే మ్యూంగ్ సమక్షంలో పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, చిప్స్ నుంచి షిప్స్ వరకు, టాలెంట్ నుంచి సాంకేతిక వరకు, ఎంటర్‌టైన్మెంట్ నుంచి ఎనర్జీ వరకు ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాల విలువ 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు.

# భీమ్ యాప్‌లో సిబిల్ స్కోర్!

### కొత్త ఫీచర్ అందుబాటులోకి

న్యూఢిల్లీ: భారత్ సొంత యూపీఐ పేమెంట్స్ యాప్ అయిన భీమ్, తన వినియోగదారులకు ఓ కీలకమైన సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇకపై రోజువారీ లావాదేవీలతో పాటు తమ క్రెడిట్ స్కోర్‌ను కూడా నేరుగా యాప్‌లోనే చూసుకునే అవకాశాన్ని కల్పించింది. ఇందుకోసం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు చెందిన భీమ్ సర్వీసెస్ లిమిటెడ్, ప్రముఖ క్రెడిట్ బ్యూరో అయిన ట్రాన్స్‌యూనియన్ సిబిల్‌తో చేతులు కలిపింది. ఈ కొత్త ఫీచర్ ద్వారా యూజర్లు తమ సిబిల్ స్కోర్‌తో పాటు పూర్తి క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్‌ను కూడా భీమ్ యాప్‌లోనే పొందవచ్చు. అయితే, యూజర్ల భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వారి స్పష్టమైన అనుమతి తీసుకున్న తర్వాతే క్రెడిట్ సమాచారాన్ని అందిస్తారు. భీమ్ యాప్ వెర్షన్ 4.0.19, ఆపై వెర్షన్లు




వాడుతున్న వారు ఈ సేవలను వినియోగించుకోవచ్చు. కేవలం నగదు బదిలీలకే పరిమితం కాకుండా ప్రజల్లో ఆర్థిక ఆరోగ్యంపై అవగాహన పెంచడమే ఈ ఫీచర్ ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా ట్రాన్స్‌యూనియన్ సిబిల్ ఎండీ, సీఈఓ భవేశ్ జైన్ మాట్లాడుతూ... "భారతీయులు క్రెడిట్ విషయంలో కేవలం లావాదేవీలకే పరిమితం కాకుండా ప్రణాళికాబద్ధంగా ఆలోచిస్తున్నారు. ఈ దశలో వినియోగదారుల్లో అవగాహన పెంచడానికి ఈ ఫీచర్ ఒక ముఖ్యమైన ముందడుగు" అని తెలిపారు. యాప్‌లో సరళత, యూజర్ నియంత్రణ అనే ప్రాథమిక సూత్రాలనే ఇప్పుడు క్రెడిట్ సేవలకు కూడా విస్తరిస్తున్నామని ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ ఎండీ, సీఈఓ లలితా నటరాజ్ వివరించారు. ఇటీవలే (మార్చి నెలలో) భీమ్ యాప్‌లో బయోమెట్రిక్ అథెంటికేషన్ ఫీచర్‌ను ఎన్‌పీసీఐ ప్రవేశపెట్టింది. దీని ద్వారా రూ. 5,000 వరకు లావాదేవీలను వేలిముద్ర లేదా ఫేస్ రికగ్నిషన్‌తో పూర్తి చేసే సౌకర్యం కలిగింది. కాగా, భారత్ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఇటీవలే 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రియల్ టైమ్ పేమెంట్స్‌లో 49 శాతం వాటాతో యూపీఐ అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరి (2026) నెలలోనే యూపీఐ ద్వారా రూ. 28.33 లక్షల కోట్ల విలువైన 21.70 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. ఎన్‌పీసీఐ అభివృద్ధి చేసిన భీమ్ యాప్, 15కు పైగా భారతీయ భాషల్లో కోట్లాది మందికి సేవలు అందిస్తోంది.




## ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. రోజంతా సానుకూలంగా ట్రేడ్ అయినప్పటికీ, చివరి గంటలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు లాభాలను చాలావరకు కోల్పోయాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 27 పాయింట్ల స్వల్ప లాభంతో 78,520.30 వద్ద, నిఫ్టీ 11.30 పాయింట్లు పెరిగి 24,364.85 వద్ద స్థిరపడ్డాయి. పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు రాజుకోవడమే మార్కెట్ల బలహీన ట్రెండ్ కు ప్రధాన కారణం. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్‌కు చెందిన కార్గో నౌకను అమెరికా నౌకాదళం స్వాధీనం చేసుకోవడం, హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ కాల్పులు జరిపినట్లు వచ్చిన వార్తలు అంతర్జాతీయంగా ఆందోళన పెంచాయి. ఈ పరిణామాలతో అంతర్జాతీయ చమురు సరఫరాకు అంతరాయం కలగవచ్చనే భయాలు మార్కెట్లలో అనిశ్చితికి దారితీశాయి. దీంతో మార్కెట్లలో అస్థిరతకు సూచిక అయిన ఇండియా వీఐఎక్స్ ఏకంగా 10.5 శాతం పెరిగి 19.01 స్థాయికి చేరింది. రంగాల వారీగా చూస్తే, పీఎస్‌యూ బ్యాంకింగ్, మీడియా రంగాల షేర్లు రాణించగా, ఐటీ, రియల్టీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, హిందాల్కో, టాటా మోటార్స్ వంటి షేర్లు నష్టాలతో సూచీలపై ఒత్తిడి పెంచాయి. మార్కెట్ నిపుణుల ప్రకారం, నిఫ్టీకి 24,400 - 24,500 జోన్ కీలక నిరోధంగా ఉంది. ఈ స్థాయిని దాటితేనే 25,000 వైపు ర్యాలీ కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు, 24,200 తక్షణ మద్దతుగా పనిచేస్తుందని, ఆ తర్వాత 24,000 స్థాయి వద్ద బలమైన డిమాండ్ ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ పరిణామాలు స్వల్పకాలికంగా మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు.

## అమెరికాను నమ్మలేం

### చర్చలపై నిర్ణయం తీసుకోలేదు: ఇరాన్

టెహ్రాన్: అమెరికాతో జరగాల్సిన తదుపరి దశ చర్చల్లో పాల్గొనడంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ సోమవారం స్పష్టం చేసింది. వాషింగ్టన్ నుంచి వైరుధ్యపూరిత చర్యలు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలోనే ఈ వైఖరి తీసుకున్నట్లు తెలిపింది. టెహ్రాన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘేయి ఈ విషయాలు వెల్లడించారు. "తదుపరి చర్చల గురించి మేము ఇంకా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు" అని ఆయన స్పష్టంగా చెప్పారు. దౌత్య మార్గాన్ని అనుసరిస్తున్నామని చెబుతూనే అమెరికా ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. కాల్పుల విరమణ ఒప్పందం ప్రారంభం నుంచే అమెరికా నుంచి తమకు వ్యతిరేకత, ఫిర్యాదులు ఎదురయ్యాయని బాఘేయి పేర్కొన్నారు. తాజాగా ఆదివారం రాత్రి హర్మూజ్ జలసంధిలో ఇరాన్ వాణిజ్య నౌకపై అమెరికా



దాడి చేసిందని, ఇది కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, దురాక్రమణ చర్య అని ఆరోపించారు. అయితే, అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకోవడానికి ప్రయత్నించిన ఇరాన్ కార్గో షిప్‌ను అడ్డగించి, స్వాధీనం చేసుకున్నామని ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా చర్యల్లోని ఈ అస్థిరత, చర్చల ప్రక్రియపై తమకున్న అపనమ్మకాన్ని మరింత పెంచుతోందని బాఘేయి అన్నారు. గతంలో అమెరికా రెండుసార్లు దౌత్యానికి ద్రోహం చేసిందని, తమ సార్వభౌమత్వంపై దాడి చేసిందని గుర్తుచేశారు. ఈ అనుభవాలను విస్మరించలేమని, జాతీయ ప్రయోజనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే భవిష్యత్ మార్గంపై నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కాగా, రేపు (ఏప్రిల్ 21) పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో చర్చలు ఉంటాయని ట్రంప్ చెబుతున్న నేపథ్యంలో, ఇరాన్ తాజా ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కాల్పులు చేసింది మా దళాలేనా? విచారణ చేపట్టాం: ఇరాన్ ప్రభుత్వం

టెహ్రాన్: హర్మూజ్ జలసంధిలో ఇటీవల రెండు భారత నౌకలపై కాల్పులు జరిపిన ఘటనపై ఇరాన్ స్పందించింది. భారత జెండా కలిగిన నౌకలపై కాల్పులు జరిపింది తమ దళాలేనా అన్న అంశంపై దర్యాప్తు చేపట్టినట్లు ఇరాన్ వెల్లడించింది. ఈ మేరకు ఆ దేశ ప్రతినిధి ఇస్మాయిలీ బాఘేయి మాట్లాడుతూ, మా బలగాలే భారత నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయా అనే అంశంపై సంబంధిత సంస్థలు విచారణ చేపట్టాయని అన్నారు. శనివారం హర్మూజ్ జలసంధిలో ఐఆర్‌జీసీ అనుమతి లభించిన అనంతరం ప్రయాణిస్తున్న రెండు భారత నౌకలపై కాల్పులు జరిగాయి. దీనితో ఆ రెండు నౌకలు తిరిగి పర్షియన్ గల్ఫ్‌లోకి వెళ్లిపోయాయి. ఒక నౌకలో 20 లక్షల బ్యారెళ్ల చమురు ఉంది. ఈ ఘటనపై భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీకి కేంద్రం సమన్లు జారీ చేసింది. ఇరాన్ జలసంధిని తెరిచినట్లు ప్రకటించిన తర్వాత ఈ నౌకలు బయల్దేరగా, వాటిపై కాల్పులు జరగడంతో భారత్ తీవ్రంగా స్పందించింది.

### లారంగ్ ఐలాండ్‌కు దూరంగా ఉండండి: ఇండియన్ నేవీ

హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించే భారత పతాక నౌకలకు ఇండియన్ నేవీ కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఇటీవల భారత జెండాతో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్ అడ్వైజరీ జారీ చేసింది. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మూజ్‌లో ప్రయాణించాలని సూచించింది. హర్మూజ్ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించుకునేందుకే ఈ సూచనలని తెలిపింది. కాగా, హర్మూజ్ జలసంధికి సమీపంలో లారక్ ఐలాండ్ ఉంటుంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 11 నౌకలు ఈ జలమార్గాన్ని దాటాయి. ఈ జలసంధిని దాటిన చివరి నౌక దేశ్ గరిమ ఏప్రిల్ 18న దీనిని దాటింది. అదేరోజు జగ్ అర్ణవ్, సన్మార్ హెరాల్డ్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి.

## రాజస్థాన్ రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం

### ప్రధాని ప్రారంభోత్సవానికి ఒకరోజు ముందు ఘటన

జైపూర్: రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రాలో ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) రిఫైనరీలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఈ రిఫైనరీని ప్రారంభించాల్సి ఉండగా, ఒక్కరోజు ముందే ఈ ఘటన జరగడం తీవ్ర కలకలం రేపింది. దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌గా దీనిని నిర్మించారు. హెచ్‌పీసీఎల్, రాజస్థాన్ ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో సుమారు రూ.79,459 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్టును చేపట్టారు. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం గానీ, గాయాలు గానీ అయినట్లు ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి సమాచారం లేదు. రేపు జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరై, జాతికి అంకితం చేయాల్సి ఉంది. ఈ సందర్భంగా ఆయన ఎల్పీజీ ట్యాంకర్లను జెండా ఊపి ప్రారంభించి, బహిరంగ సభలో ప్రసంగిస్తారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. కార్యక్రమం కోసం సుమారు 5,000 మంది పోలీసు సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటన, రిఫైనరీ ప్రారంభోత్సవ కార్యక్రమం యథాతథంగా జరుగుతుందా లేదా అనే దానిపై అనిశ్చితి నెలకొంది. దీనిపై అధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రీపెయిడ్ ప్లాన్ ధరను పెంచిన ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: ప్రీపెయిడ్ వినియోగదారులకు ఎయిర్‌టెల్ షాకిచ్చింది. రూ.859కి 84 రోజుల వ్యాలిడిటీ కలిగిన పాపులర్ ప్రీపెయిడ్ ప్లాన్ ధరను పెంచింది. ఈ ప్లాన్ ధరను రూ.899కి సవరించింది. ఈ పెంపుకు సంబంధించి వినియోగదారులకు ముందస్తు సమాచారం రాలేదు. దీనితో




క్రమం తప్పకుండా ఈ ప్లాన్‌లో రీఛార్జ్ చేసుకునే వారికి ఇప్పుడు రూ.40 అదనపు భారం పడుతుంది. ధరను పెంచినప్పటికీ, ఎలాంటి అదనపు ప్రయోజనాలు జతచేయలేదు. రూ.899తో 84 రోజుల వ్యాలిడిటీ కోసం రీఛార్జ్ చేస్తే రోజుకు 1.5 జీబీ హైస్పీడ్ డేటా, అపరిమిత కాల్స్, 100 ఎస్సెమ్మెస్‌లు, ఎయిర్‌టెల్ ఫ్రీ హలోట్యూన్ ప్రయోజనాలు ఉంటాయి. ఇదిలా ఉండగా రోజుకు 1.5 జీబీ డేటాతో 77 రోజుల వ్యాలిడిటీ కలిగిన రూ.799 ప్లాన్‌ను ఎయిర్‌టెల్ తొలగించింది. యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ఈ ధరలు పెంచింది.

## జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం

టోక్యో: జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. ఉత్తర జపాన్‌లో రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో భూప్రకంపనలు వచ్చాయి. దీనితో అధికారులు తీర ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతంలో మూడు మీటర్ల మేర అలలు ఎగిసిపడవచ్చని జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4.54 గంటలకు ఉత్తర జపాన్‌లో సన్రికు ప్రాంతంలో భూకంపం సంభవించింది. సముద్రమట్టం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. తీర ప్రాంత ప్రజలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు సురక్షిత ప్రాంతాల్లో, ఎత్తైన ప్రదేశాల్లోనే ఉండాలని అధికారులు పౌరులకు సూచించారు. జపాన్ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా భూకంపాలు సంభవించే దేశాల్లో ఒకటి. సాధారణంగా ప్రతి సంవత్సరం దాదాపు 1,500 వరకు భూకంపాలు సంభవిస్తాయి.

వయ్యారి చిత్రం







## పెద్ది.. 5 నిమిషాల సీన్ కోసం మూడ్నెల్లు

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'పెద్ది'.. దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది. ఈ మూవీ కోసం పనిచేసిన ఫ్రేమ్ ఎక్స్ వీఎఫ్ఎక్స్ సంస్థ అధినేత నిలేష్ పలు వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఇంగ్లీష్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన మూవీ వీఎఫ్ఎక్స్ పనిగురించి మాట్లాడారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ మూవీని నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీత స్వరకర్త. పెద్ది సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్‌కు సంబంధించి ఫ్రేమ్ ఎక్స్ అనే సంస్థ పనిచేస్తుంది. మూవీలోని కొన్ని సీన్స్ గురించి ఆ సంస్థ అధినేత నిలేష్ పలు వ్యాఖ్యలు చేశారు. పెద్ది సినిమాలోని 5 నిమిషాల రెజ్లింగ్ సీన్ వీఎఫ్ఎక్స్ కోసం చాలా ఎక్కువ సమయం పడిందని ఆయన అన్నారు. ఈ సీన్ పూర్తి చేసేందుకు సుమారు 3నెలల సమయం పడినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు. వీఎఫ్ఎక్స్ పని ఫ్రేమ్ వారీగా ఉంటుందని, ఒక నిమిషానికి 1440 ఫ్రేమ్‌లు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల, ప్రతి ఫ్రేమ్‌లో చేసిన మెరుగుదల పరిధిని బట్టి పని ఖర్చు మారుతుంది" అని ఆయన చెప్పారు. పెద్ది గురించి నిలేష్ ఇచ్చిన అప్‌డేట్ అభిమానులను ఖచ్చితంగా సంతోషపరుస్తుంది. ఎందుకంటే ఎలాంటి రాజీ లేకుండా ప్రేక్షకులకు సాధ్యమైనంత ఉత్తమమైన అనుభూతిని అందించాలనే లక్ష్యంతో చిత్ర బృందం వీఎఫ్ఎక్స్ కోసం తగినంత సమయాన్ని కేటాయిస్తోంది. పెద్ది మూవీలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలలో కనిపించనున్నారు.

## ముంబైకి అల్లు అర్జున్ మకాం!




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కుటుంబంతో పాటు ముంబైలో తాత్కాలికంగా స్థిరపడనున్నారని తెలుస్తోంది. తను నటిస్తున్న కొత్త సినిమా రాకా షూటింగ్ ఎక్కువగా ముంబైలోనే జరుగుతుండటంతో ఆయన ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇది నిజమైతే, సినిమా కఠినమైన షూటింగ్ షెడ్యూల్‌ను నిర్వహించడానికి అవకాశం దొరుకుతుంది. ఆపై రెండు నగరాల మధ్య నిరంతర ప్రయాణాన్ని తగ్గించుకోని సినిమా కోసం మరింత సమయం కేటాయించవచ్చని బన్నీ ఆలోచిస్తున్నాడట. బాలీవుడ్‌లో వస్తున్న వార్తల ప్రకారం అల్లు అర్జున్ తన తదుపరి చిత్రానికి పూర్తిగా అంకితమవ్వడానికి రాబోయే రెండు, మూడు సంవత్సరాల పాటు ముంబైలోనే ఉండాలని ప్లాన్ చేస్తున్నారట. తరచూ ప్రయాణాల వల్ల కలిగే అలసట లేకుండా ఉండాలని అనుకున్నారట. ఈ సమయం షూటింగ్‌పై దృష్టి పెట్టడానికి తనకు సహాయపడుతుందని ఆయన భావిస్తున్నారని సమాచారం. రాకా మూవీలోని పాత్ర కోసం ఆయన శారీరకంగా పెద్ద మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. రాకాలో తన పాత్ర కోసం ప్రతిరోజూ దాదాపు నాలుగు గంటల పాటు ప్రాస్థెటిక్ మేకప్‌పై గడుపుతున్నారని, ఆ తర్వాత దానిని తొలగించడానికి మరో రెండు గంటలు వెచ్చిస్తున్నారని సమాచారం. అందుకే ముంబైలోనే ఉంటే సమయం కాస్త కలిసొస్తుందని బన్నీ ఉన్నారట.

## 30న ధనుష్ కర రిలీజ్




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న కొత్త చిత్రం 'కర' తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాను ఏప్రిల్ 30న రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రంలో ధనుష్ సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ పోస్టర్‌లో ధనుష్, మమితా బైజు ఒక మధ్యతరగతి భార్యాభర్తలుగా చాలా సహజంగా కనిపిస్తున్నారు. వారిద్దరి మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. ఈ చిత్రాన్ని తెలుగులో విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ పతాకాలపై సిహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర సంయుక్తంగా విడుదల చేస్తున్నారు. తమిళంలో డా. ఇషారి కె. గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాకు విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించగా, సంచలన సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. థేనీ ఈశ్వర్ సినిమాటోగ్రఫీ, శ్రీజిత్ సారంగ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. త్వరలోనే సినిమా ప్రమోషన్లను కూడా ప్రారంభించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ధనుష్‌కు తెలుగులో ఉన్న మార్కెట్ దృష్ట్యా 'కర' చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి.

## అనసూయ కేసులో మరొకరు అరెస్టు



సామాజిక మాధ్యమాలలో టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్‌పై అసభ్యకర పోస్టులు పెడుతున్న నిందితుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనసూయ లక్ష్యంగా అసభ్యకరమైన సోషల్ మీడియా కంటెంట్ పోస్ట్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని దొరెపల్లి చంటి(30)గా సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. అతను చంటిదొరెపల్లి అనే పేరుతో సోషల్ మీడియా హ్యాండిల్ నిర్వహిస్తున్నారు. కాగా..ఇటీవలే జనార్ధన్ అనే నిందితుడిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు కడప జిల్లాకు చెందిన జనార్ధన్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది డిసెంబర్ 23న పలువురు సోషల్ మీడియాలో తనపై పరువు నష్టం కలిగించే విధంగా, అశ్లీల వ్యాఖ్యలను పోస్ట్ చేసి.. అభ్యంతరకరమైన కంటెంట్‌ను ప్రసారం చేశారంటూ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అనసూయ ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రకాశ్ రాజ్‌పై బ్యాన్?



దక్షిణాది విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ ఏదో ఒక వివాదంలో వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల ఆయన శ్రీరాముడిని ఉద్దేశించి తీవ్ర వివాదానికి దారితీశాయి. ఆయన కామెంట్స్‌పై వ్యతిరేకత రావడంతో వివరణ ఇచ్చారు. అయినప్పటికీ ఈ వివాదం ఇప్పట్లో సద్దుమణిగేలా కనిపించడం లేదు. ఈ వివాదం చిలికి చిలికి గాలివానలా మరింత ముదిరేలా కనిపిస్తోంది. ప్రకాశ్ రాజ్‌ను సినీ ఇండస్ట్రీ నుంచి బ్యాన్ చేయాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. శ్రీరాముడిపై చేసిన కామెంట్స్‌తో ఆయనపై పలువురు నెటిజన్స్ మండిపడుతున్నారు. దీంతో ఆయనపై నిషేధం విధించాలనే డిమాండ్స్ రోజు రోజుకు ఎక్కువవుతున్నాయి. సినీ వర్గాలు సైతం ప్రకాశ్ రాజ్‌పై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ప్రకాశ్ రాజ్ తన చేసిన కామెంట్స్‌పై వివరణ ఇచ్చినప్పటికీ వ్యతిరేకత ఏమాత్రం తగ్గడం లేదు. అయితే కొందరు దర్శకులు, నటులు మాత్రం ఈ విషయంపై పునరాలోచన చేయాలంటూ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## విజయ్ విడాకుల కేసు వాయిదా

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతున్న తరుణంలో నటుడు, రాజకీయ నాయకుడు విజయ్‌కు సంబంధించిన విడాకుల కేసు మరోసారి వార్తల్లోకి వచ్చింది. తన భార్య సంగీత నుంచి విడాకులు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. అయితే, ఇరుపక్షాల అభ్యర్థన మేరకు కేసు విచారణను జూన్ 15వ తేదీకి వాయిదా వేసింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని స్థాపించి రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్, ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో



చురుకుగా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన విడాకుల కేసు విచారణకు వచ్చింది. గతంలో ఈ కేసులో వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు విజయ్‌కు సమన్లు జారీ చేసింది. అయితే, సోమవారం ఇరుపక్షాల న్యాయవాదులు కోర్టులో ఒక తాజా పిటిషన్ దాఖలు చేసి, విచారణను వాయిదా వేయాలని కోరారు. విజయ్, సంగీత ఇద్దరూ పరస్పర అంగీకారంతో స్నేహపూర్వకంగా విడిపోవాలని నిర్ణయించుకున్నారని వారి న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. విడాకులకు సంబంధించిన కీలక అంశాలైన భరణం, ఆస్తుల పంపకం వంటి వాటిపై ఇప్పటికే ఇరువర్గాల మధ్య అవగాహన కుదిరినట్లు సమాచారం. ముఖ్యంగా వారి పిల్లల భవిష్యత్తు భద్రతకు సంబంధించిన విషయాలపై స్పష్టమైన ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఆర్థికపరమైన వివరాలను కోర్టుకు సమర్పించిన పిటిషన్‌లో వెల్లడించలేదు. ప్రస్తుతం ఈ నెల 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో విజయ్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నారని, భద్రతా కారణాలు, ఇతర కార్యక్రమాల వల్ల ఆయన కోర్టుకు హాజరుకాలేకపోతున్నారని న్యాయవాదులు వివరించారు.

## వీడీ కొత్త సినిమాకు క్లాప్



రౌడీ విజయ్ దేవరకొండ హాయ్ నాన్న డైరెక్టర్ శౌర్యువ్‌తో జతకట్టారు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న ఈ చిత్రం అఫీషియల్‌గా ప్రారంభమైంది. ఈ మూవీకి ముఖ్య అతిథిగా హాజరైన నేచురల్ స్టార్ నాని క్లాప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రస్తుతానికి ఈ మూవీకి వీడీ శౌర్యువ్ అనే వర్కింగ్ టైటిల్ ఖరారు చేశారు. తొలిసారి వస్తోన్న ఈ కాంబోపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్' చిత్రానికి పనిచేసిన అలెజాండ్రో మార్టినెజ్ సినిమాటోగ్రఫీని అందిస్తుండటం మూవీపై అంచనాలు మరింత పెంచేసింది. ఈ మూవీకి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించనున్నారు. అయితే ఈ చిత్రంలో హీరోయిన్ ఎవరనే విషయాన్ని ఇంకా రివీల్ చేయలేదు.




# తిలక్ విధ్వంసం

## సెంచరీతో కదం తొక్కిన హైదరాబాదీ

## ముంబైకి రెండో విజయం.. గుజరాత్ ఓటమి

| ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక | | | | |
|---|---|---|---|---|
| జట్టు | ఆ | గె | ఓ | పా |
| పంజాబ్ | 6 | 5 | 0 | 11 |
| బెంగళూరు | 6 | 4 | 2 | 8 |
| రాజస్థాన్ | 6 | 4 | 2 | 8 |
| హైదరాబాద్ | 6 | 3 | 3 | 6 |
| ఢిల్లీ | 5 | 3 | 2 | 6 |
| గుజరాత్ | 6 | 3 | 3 | 6 |
| ముంబై | 6 | 2 | 4 | 4 |
| చెన్నై | 6 | 2 | 4 | 4 |
| లక్నో | 6 | 2 | 4 | 4 |
| కోల్‌కతా | 7 | 1 | 5 | 3 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు





**ఈ ఐపీఎల్‌లోముంబై ఇండియన్స్ రెండో విజయంతో మురిసింది. వరసగా నాలుగు ఓటములనుంచి తేరుకున్న ముంబైకి తిలక్ వర్మ(101 నాటౌట్) సునామీ సెంచరీతో భారీ స్కోరందించగా.. బంతితో అశ్వనీ కుమార్(4-24) గుజరాత్ టైటన్స్ మిడిలార్డర్‌ను కూల్చాడు. ఈ సీజన్‌లో తొలి వికెట్‌తో బుమ్రా(1-15) గుజరాత్ పతనాన్ని మొదలెట్టగా కుర్రాడు అశ్వన్ వికెట్ల వేటతో ముంబైని గెలిపించాడు.**

200 పరుగుల ఛేదనలో పరిమితమైన గుజరాత్‌కు సొంత ప్రేక్షకుల సమక్షంలో భారీ ఓటమి చవిచూసింది. ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ గెలుపు తోవ తొక్కింది. పంతొమ్మిదో సీజన్‌లో వరస పరాజయాలకు వీడ్కోలు పలుకుతూ అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుగా ఓడించింది.

ముంబై నిర్దేశించిన 200 పరుగుల భారీ ఛేదనలో తొలి ఓవర్లోనే గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్(0) వికెట్ సాధించాడు బుమ్రా(1-15). ఈ సీజన్‌లో అతడికిదే మొదటి వికెట్ కాగా.. ప్రమాదకరమైన బట్లర్(5)ను పాండ్యా బోల్తా కొట్టించాడు. టాపార్డర్ వైఫల్యంతో షాక్ తిన్న గుజరాత్‌ను అశ్వనీ కుమార్ మరింత దెబ్బ తీస్తూ శుభ్‌మన్ గిల్(14)ను వెనక్కి పంపాడు. శాంట్నర్ ఒకే ఓవర్లో సుందర్(26), డేంజరస్ గ్లెన్ ఫిలిప్స్(6) వికెట్లు తీసి గుజరాత్‌ను కష్టాల్లోకి నెట్టాడు. టపటపా ఐదు వికెట్లు పడిన వేళ ఇంప్యాక్ట్ సబ్ రాహుల్ తెవాటియా(8), షారుక్ ఖాన్(17)లు ఆశలు రేపారు. కానీ, తెవాటియాను అపై ఒకే ఓవర్లో రషీద్ ఖాన్(4), షారుక్‌లను ఔట్ చేసిన అశ్వనీ కుమార్(4-24) గుజరాత్ ఆశలపై నీళ్లు చల్లాడు. రబడ(12) కాసేపు పోరాడినా సిరాజ్ ఎల్బీగా ఔటవ్వగా గుజరాత్ 100కే కుప్పకూలింది. అహ్మదాబాద్‌లో ముంబై ఇండియన్స్ ఆరంభంలో తడబడినా గొప్పగా పుంజుకుంది. పవర్ ప్లేలోనే రబడ మూడు వికెట్లతో హడలెత్తించినా కుర్రాళ్లు తిలక్ వర్మ(101 నాటౌట్), నమన్ ధిర్(45)లు దంచేశారు. గుజరాత్ బౌలర్ల వ్యూహాలను చిత్తు చేసిన ఈ ద్వయం కీలక భాగస్వామ్యంతో ముంబైని ఆదుకుంది. నమన్ ఔటయ్యాక మరింత రెచ్చిపోయిన తిలక్ సూపర్ సెంచరీతో భారీ స్కోరందించాడు. ప్రసిధ్ వేసిన ఆఖరి ఓవర్లో ఫోర్, రెండు సిక్సర్లు బాదిన తెలుగబ్బాయి ఐపీఎల్‌లో శతకం కొట్టేశాడు. ఫలితంగా గుజరాత్ అడ్డాలో ముంబై భారీస్కోర్‌తో సవాల్ విసిరింది.



# డోపింగ్ దేశంగా భారత్

### అత్యంత ప్రమాదకరం.. ఏఐయూ తాజా నిర్ణయం

భారత్‌లో డోపింగ్ సమస్య తీవ్ర రూపం దాల్చింది. డోపింగ్ అత్యంత ప్రమాదకరంగా ఉన్న దేశంగా భారత్‌ను వరల్డ్ అథ్లెటిక్స్‌కు చెందిన అథ్లెటిక్స్ ఇంటెగ్రిటీ యూనిట్(ఏఐయూ) గుర్తించింది. ఇప్పటివరకు కేటగిరీ 'బి'లో ఉన్న భారత్‌ను కేటగిరీ 'ఏ'కు మార్చింది. ఈ కేటగిరీలో డోపింగ్ సమస్య అత్యంత ప్రమాదకరంగా ఉండే దేశాలు ఉంటాయి. రష్యా, బెలారస్, ఇథియోఫియా, కెన్యా, నైజీరియా, ఉక్రెయిన్ ఈ కేటగిరీలో ఉండగా.. ఇప్పుడు భారత్ కూడా చేరింది. చాలా కాలంగా డోపింగ్‌లో తొలి, రెండు స్థానాల్లో ఉండటంతోనే భారత్‌ను హై రిస్క్ జాబితాలో చేర్చినట్టు ఏఐయూ వెల్లడించింది. 'భారత్‌లో చాలా కాలంగా డోపింగ్ ప్రమాదకరంగా ఉంది. దేశీయ డోపింగ్ నిరోధక కార్యక్రమం నాణ్యత డోపింగ్ ముప్పుకు తగినట్టుగా లేదు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) సంస్కరణలు చేస్తున్నా పెద్దగా మార్పు రాలేదు. అథ్లెటిక్స్ సమగ్రతను పరిరక్షించేందుకు ఏఎఫ్ఐతో ఏఐయూ కలిసి పనిచేస్తుంది.'అని ఏఐయూ చైర్మన్ డేవిడ్ హౌమాన్ తెలిపారు. దీనిపై ఏఎఫ్ఐ స్పోక్ పర్సన్ అడిల్లె సుమరివాలా స్పందిస్తూ.. భారత్ అధికంగా డోప్ టెస్టులు చేయడం వల్లే ఎక్కువ మంది అథ్లెట్లు పట్టుబడ్డారని సమర్థించుకున్నారు. డోపింగ్‌కు పాల్పడుతున్న వారిని పోలీసులు పట్టుకోవాలని, తాము పోలీసులం కాదంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. పాలసీని రూపొందించడమే తమ పని అని, డోపింగ్‌ను నేరంగా పరిగణించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గత నాలుగేళ్లుగా అథ్లెటిక్స్‌లో యాంటీ డోపింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న దేశాల్లో భారతే తొలి, రెండు స్థానాల్లో నిలుస్తుంది. ఏఐయూ డాటా ప్రకారం.. 2022లో 48(2వ ర్యాంక్), 2023లో 63(2వ ర్యాంక్), 2024లో 71(1వ ర్యాంక్), 2025లో 30(1వ ర్యాంక్) ఉల్లంఘనలు జరిగాయి. ఇక, డోపింగ్ కారణంగా అత్యధికంగా సస్పెండ్ అయిన అథ్లెట్లు భారత్‌లోనే ఎక్కువ. 148 మంది సస్పెండ్‌కు గురయ్యారు. ఇంతకుముందు కెన్యా అగ్రస్థానంలో ఉండగా.. ఆ దేశాన్ని భారత్ అధిగమించింది. 'ఏ' కేటగిరీలో చేరడంతో భారత అథ్లెట్లు డోపింగ్ రూల్స్ పాటించడం ఇక తప్పనిసరి కానుంది. వరల్డ్ అథ్లెటిక్స్ యాంటీ డోపింగ్ రూల్స్ ప్రకారం.. ఏఎఫ్ఐ రూల్ 15 కిందికి వస్తుంది. దీంతో ఏఎఫ్ఐ అంత్జాతీయ ప్రమాణాలకుక అనుగుణంగా ప్రతి ఏడాది పరీక్షలు నిర్వహించాడు. సమాచారం ఇవ్వకుండానే అథ్లెట్లను టెస్టు చేయొచ్చు. ఇతర దేశాల్లో శిక్షణ తీసుకుంటున్న అథ్లెట్లను కూడా పరీక్షించాలి. ఏఐయూ నిర్దేశించిన 10 నెలల వ్యవధిలో ముందు సమాచారం లేకుండా నిర్వహించే మూడు పోటీయేతర టెస్టుల్లో పాల్గొనాలి. పాల్గొనని అథ్లెట్లు వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, ఒలింపిక్ గేమ్స్‌లో పాల్గొనడానికి అనర్హులు. ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న వేళ భారత్‌ను డోపింగ్ సమస్య ఆందోళనకు గురిచేస్తుంది. ఈ విశ్వక్రీడలకు భారత్ ఇప్పటికే బిడ్ వేసిన విషయం తెలిసిందే. హోస్టింగ్ రైట్స్ రేసులో ముందు వరుసలో కూడా ఉంది. ఈ ఏడాది చివరిలో లేదా 2027 ఆరంభంలో ఆతిథ్య హక్కులు ప్రకటించే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో డోపింగ్‌లో భారత్ అగ్రస్థానంలో ఉండటం తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం లేకపోలేదు. క్రీడా ప్రపంచంలో ఇండియాపై కచ్చితంగా ఇది నెగటివ్ ఇమేజ్‌ను సృష్టిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# శనకపై పీసీబీ నిషేధం



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీలంక టీ20 కెప్టెన్ డాసున్ శనకపై ఏడాదిపాటు పీఎస్ఎల్‌లో ఆడకుండా నిషేధం విధించింది. లాహోర్ ఖలందర్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాల్సిన శనక.. ఆ టోర్నీ నుంచి మధ్యలోనే తప్పుకున్న విషయం తెలిసిందే. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ నుంచి ఆఫర్ రావడంతో పీఎస్ఎల్‌ను వీడి ఐపీఎల్‌లో చేరాడు. దీన్ని ఒప్పంద ఉల్లంఘనగా భావించిన పీసీబీ శనకపై చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో 2027 పీఎస్ఎల్ సీజన్‌లో అతడికి ఆడే అవకాశం ఉండదని స్పష్టం చేసింది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ సామ్ కరన్ గాయపడటంతో అతడి స్థానంలో రూ.2 కోట్లకు శనకను ఆర్ఆర్ ఫ్రాంచైజీ జట్టులోకి తీసుకుంది. ఈ విషయంపై సమీక్ష నిర్వహించిన పీసీబీ.. శ్రీలంక క్రికెటర్ శనక నియమ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చింది. టోర్నమెంట్ నుంచి ఏకపక్షంగా వైదొలగినట్లు పేర్కొంటూ అతడిపై ఏడాది నిషేధం విధించింది. తన నిర్ణయంపై శనక పశ్చాత్తాపం వ్యక్తం చేసినట్లు పీసీబీ తెలిపింది. 'పీఎస్ఎల్ నుంచి తప్పుకోవడం పట్ల క్షమాపణలు కోరుతున్నాను. పాకిస్థాన్ అభిమానుల ప్రేమను గౌరవిస్తాను' అని ఆయన పేర్కొన్నట్లు వెల్లడించింది. ఇక ఇటీవల ఇదే తరహాలో జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానిపై కూడా పీసీబీ రెండేళ్ల నిషేధం విధించడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే.

# నా దేశం కోసం భారత పౌరసత్వం వదులుకున్నా: రషీద్ ఖాన్

బంతి అందుకున్నాడంటే బ్యాటర్లను ఇరుకునపెట్టే రషీద్ ఖాన్ లాంటి స్పిన్నర్ తమ జట్టులో ఉండాలని ప్రతి దేశం కోరుకుంటుంది. ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపు తిప్పే ఈ స్పిన్ మాంత్రికుడిని తమ దేశంలో స్థిరపడాలని భారత్, ఆస్ట్రేలియా నుంచి పౌరసత్వం ఆఫర్లు కూడా వచ్చాయట. కానీ, తానే సున్నితంగా తిరస్కరించానని చెబుతున్నాడీ అఫ్గనిస్థాన్ మాజీ కెప్టెన్. త్వరలో రాబోతున్న తన స్వీయ పుస్తకంలో రషీద్ ఈ విషయాన్ని వెల్లడించాడు. అనామక జట్టైన అఫ్గనిస్థాన్ పెద్ద జట్లకు షాకిస్తుందంటే రషీద్ ఖాన్ వంటి మేటి స్పిన్నర్ ఆ టీమ్‌లో ఉండడం ఓ కారణం. అంతర్జాతీయ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో రాణిస్తున్న రషీద్.. తన క్రికెట్ ప్రయాణం గురించి పుస్తకం తీసుకొస్తున్నాడు. 'నాకు పౌరసత్వం ఇస్తామని పలు దేశాలు ఆసక్తి చూపించాయి. భారత్, ఆస్ట్రేలియా నుంచి నాకు ఆఫర్లు వచ్చాయి. అయితే.. నేను సున్నితంగా తిరస్కరించాను. నా మాతృ దేశానికి ఆడకుంటే.. నేను ఏ దేశానికి ఆడను అని తేల్చి చెప్పేశాను' అని రషీద్ తెలిపాడు. ఇంతకూ తనకు ఇండియా నుంచి ఆఫర్ ఎప్పుడు వచ్చిందో కూడా వివరించాడీ స్టార్ స్పిన్నర్. ఐపీఎల్ 2023 సీజన్‌లో గుజరాత్ టైటన్స్ అధికారి ఒకరు 'భారత క్రికెట్ బోర్డు అత్యున్నత అధికారి ఒకరు మిమ్మల్ని కలవాలని అనుకుంటున్నారు' అని నాతో చెప్పాడు. 'మీ దేశంలో పరిస్థితులు ఏమీ బాగా లేవు. భారత్‌కు వచ్చి స్థిరపడు. నీకు భారత పౌరుడిగా అవసరమైన పత్రాలు ఇస్తాం. ఇక్కడే జీవించు. ఇక్కడే క్రికెట్ ఆడు' అని ఆ అధికారి నాతో అన్నాడు. ఆయన మాటలు విని ఆశ్చర్యపోయాను. ఆయనకు ఏమని బదులివ్వాలో తోచలేదు. చిన్నగా నవ్వి.. మీకు చాలా కృతజ్ఞతలు. నేను నా దేశం అఫ్గనిస్థాన్‌కు ఆడుతున్నాను. నా మాతృదేశానికి ఆడకుంటే.. ప్రపంచంలోనే ఏ దేశం తరఫున నేను ఆడను అని చెప్పాను అని రషీద్ తన పుస్తకంలో పేర్కొన్నాడు.





# టీ20లకు 35 మంది

### జాబితా సిద్ధం చేస్తున్న బీసీసీఐ

కొంతకాలంగా భారత జట్టు మూడు ఫార్మాట్లలో దాదాపు వేర్వేరు టీమ్‌లతో ఆడుతున్న విషయం తెలిసిందే. భారత జట్టులో చోటు కోసం విపరీతమైన పోటీ ఉన్న నేపథ్యంలో బీసీసీఐ అందరికీ అవకాశాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తోంది. ఐపీఎల్ వల్ల జాతీయ జట్టులో చోటు కోసం చూస్తున్న ప్లేయర్ల సంఖ్య ఏడాది ఏడాదికి పెరుగుతోంది. ఈ సీజన్‌లోనూ కొందరు యువ క్రికెటర్లు సత్తాచాటుతున్నారు. దీంతో ఎంపిక ప్రక్రియ సెలెక్టర్లకు తలకు మించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ మరో కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఒకే సమయంలో రెండు టీ20 జట్లను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టు బీసీసీఐ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. 30–35 మందితో బోర్డు ఓ జాబితాను సిద్ధం చేయనున్నట్టు తెలుస్తోంది. ఇందులో నుంచి రెండు జట్లను సిద్ధం చేయాలని భావిస్తున్నది. ఈ ఏడాదే రెండు భారత టీ20 జట్లు ఒకే సమయంలో ఆడే అవకాశం ఉంది. జపాన్‌లో ఆసియా గేమ్స్, వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు మధ్య పెద్దగా గ్యాప్ లేదు. ఆసియా గేమ్స్ కూడా టీ20 ఫార్మాట్‌లోనే జరగనుంది. కాబట్టి, ఒకే టైంలో రెండు భారత జట్ల మ్యాచ్‌కు ఈ రెండు టోర్నీలు వేదిక అవ్వొచ్చు. రెండు టీ20 జట్లలో ఒకదానికి శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉందని కూడా సదరు వర్గాలు తెలిపాయి. 'ఆసియా క్రీడలు, భారత్, వెస్టిండీస్ టీ20 సిరీస్ ఒకే సమయంలో జరగబోతున్నాయి. కాబట్టి, మనం రెండు టీ20 జట్లు ఆడటాన్ని చూడొచ్చు. అయితే, అంతర్జాతీయ మ్యాచ్‌లకు 30–35 మంది ప్లేయర్లను సిద్ధంగా ఉంచడటం ముఖ్యం. ఇంగ్లాండ్ టూరు, ఐర్లాండ్ టూరుతోపాటు ఆసియా గేమ్స్‌కు కూడా జట్టులో ఎక్కువ ప్లేయర్లు ఉంటారు.'అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.

ఈవార్తలు
# ప్రజావాణి

మంగళవారం 21-4-2026, జగిత్యాల

www.evarthalu.com

నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

## గొంతెండుతోంది.. దూపదీర్చరా?

తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగలాడుతున్నాడు. చెరువులు అడుగంటుతున్నాయి, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి, తాగునీటి కోసం పల్లెలు, పట్టణాలు తహతహలాడుతున్నాయి. కానీ, రెండు రాష్ట్రాల్లోని పాలకుల ప్రాధాన్యాలు మాత్రం క్షేత్రస్థాయి సమస్యల చుట్టూ కాకుండా, కేవలం రాజకీయ ఆరోపణలు, గత ప్రభుత్వాల వైఫల్యాల చుట్టూనే తిరుగుతుండటం శోచనీయం. తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ ఇన్నాళ్లు రాజకీయం నడిచింది. అవినీతి జరిగిందని, పిల్లర్లు కుంగిపోయాయని విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఇప్పుడు ఎండలు ముదిరిన వేళ హడావిడిగా ప్రాజెక్టు సందర్శనకు వెళ్లడం గమనార్హం. గత పాలకుల తప్పులను ఎత్తిచూపడం అవసరమే కావొచ్చు, కానీ ఉన్న నీటిని పొలాలకు ఎలా మళ్లించాలనే దానిపై స్పష్టమైన కార్యాచరణ ఏది? 'పనులు చేపడతాం' అనే ప్రకటనలు రైతులకు భరోసా ఇవ్వవు; పొలంలో పారే నీరు మాత్రమే వారి కడుపు నింపుతుంది. విచారణల పేరుతో కాలాన్ని వెళ్లదీస్తూ, కీలకమైన సాగునీటి సీజన్‌ను చేజార్చుకోవడం పాలనా దక్షత అనిపించుకోదు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరీ విచిత్రంగా ఉంది. అక్కడ పాలన కేవలం 'రెడ్ బుక్' హెచ్చరికల చుట్టూ, ప్రతీకార రాజకీయాల చుట్టూ సాగుతున్నట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ అక్రమాలను వెలికితీయడం తప్పు కాదు, కానీ అదే సర్వస్వం కాకూడదు.


ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ 'అమరావతి' జపం మొదలుపెట్టారు. రాజధాని నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుకు అవసరమే, కానీ కరువు ఛాయలు అలముకుంటున్న వేళ ప్రాధాన్యతలు మారాలి. రాయలసీమలో తాగునీటి కష్టాలు, ఉత్తరాంధ్రలో సాగునీటి ఎద్దడిపై దృష్టి పెట్టకుండా, కేవలం భవనాల గ్రాఫిక్కుల చుట్టూ భ్రమణం చెందడం వల్ల సామాన్యుడికి వచ్చే లాభమేంటి? రాజకీయ నాయకులకు ఎన్నికల మేనిఫెస్టోలు ముఖ్యం కావొచ్చు, కానీ ప్రజలకు ప్రాణధారమైన నీరు ముఖ్యం. ఆరోపణల హోరులో సామాన్యుడి ఆవేదన వినిపించకుండా పోతోంది. పాలకులకు ఉండాల్సింది గత ప్రభుత్వంపై పగ కాదు, ప్రజల కష్టాల పట్ల తపన. ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రాజకీయ విమర్శలు పక్కన పెట్టి, ఎండిపోతున్న గొంతులకు నీరు అందించే యుద్ధ ప్రాతిపదిక పనులపై దృష్టి సారించాలి. లేదంటే, ఈ వేసవి మంటలు కేవలం వాతావరణానికే పరిమితం కావు, ప్రజాగ్రహ రూపంలో పాలకులకూ తగులుతాయి.

# ప్రపంచ ఆర్థికం.. భారతం!

**ప్రపంచీకరణ యుగంలో ఏ దేశ ఆర్థిక వ్యవస్థ ఒకదానికొకటి బలమైన అనుసంధానంతో ఉండటం వల్ల, ఒక ప్రాంతంలో ఏర్పడే ఆర్థిక సంక్షోభం ఇతర దేశాలపై కూడా గణనీయమైన ప్రభావం చూపుతుంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం అనేది కేవలం బ్యాంకింగ్ రంగం, స్టాక్ మార్కెట్లు, పెట్టుబడుల పరిమితి వంటి అంశాలకు మాత్రమే పరిమితం కాదు; అది సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను కూడా లోతుగా ప్రభావితం చేస్తుంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఈ ప్రభావం మరింత విస్తృతంగా కనిపిస్తుంది. ముఖ్యంగా సగటు భారతీయుడి జీవన విధానం, ఆదాయం, ఉద్యోగ భద్రత, వినియోగపు అలవాట్లు వంటి అంశాలు ఈ సంక్షోభంతో నేరుగా ముడిపడి ఉంటాయి.**



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం




ప్రపంచ ఆర్థిక సంక్షోభం అనేది సాధారణంగా ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అసమతుల్యతలు ఏర్పడినప్పుడు ఉద్భవిస్తుంది. బ్యాంకుల వైఫల్యం, పెట్టుబడుల తగ్గుదల, అప్పుల పెరుగుదల, అంతర్జాతీయ వాణిజ్య క్షీణత వంటి కారణాలు దీనికి మూలం. 2008 సంవత్సరంలో ప్రపంచం చూసిన మహా ఆర్థిక సంక్షోభం ఇందుకు ప్రధాన ఉదాహరణ. ఆ సమయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన సమస్యలు ప్రపంచ వ్యాప్తంగా ప్రతికూల ప్రభావం చూపించాయి. భారతదేశం కూడా ఈ ప్రభావానికి మినహాయింపు కాదు.
భారతదేశంలో సగటు మానవునిపై ఈ సంక్షోభం ప్రభావం ప్రధానంగా ఉద్యోగ రంగంలో స్పష్టంగా కనిపిస్తుంది. అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు తగ్గించినప్పుడు, ఎగుమతులు తగ్గినప్పుడు, దేశీయ పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించుకోవాల్సి వస్తుంది. దాంతో ఉద్యోగ అవకాశాలు క్షీణిస్తాయి. ఐటీ రంగం, తయారీ రంగం, నిర్మాణ రంగం వంటి విభాగాల్లో పనిచేసే అనేక మంది ఉద్యోగులు తొలగింపులకు గురవుతారు. ఉద్యోగం కోల్పోయిన వ్యక్తి కుటుంబ ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా దెబ్బతింటుంది. ఆదాయ స్థాయిలో కూడా పెద్ద మార్పులు చోటు చేసుకుంటాయి. సంక్షోభ సమయంలో జీతాలు పెరగడం తగ్గిపోతుంది, కొన్ని సందర్భాల్లో జీతాలు కోతకు గురవుతాయి. వ్యాపారులు తమ లాభాలు తగ్గిపోవడంతో వ్యయాలను తగ్గించడానికి ప్రయత్నిస్తారు. ఈ పరిస్థితి మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రోజువారీ అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారుతుంది. ధరల పెరుగుదల కూడా సగటు మానవుని జీవనంపై గణనీయమైన ఒత్తిడిని సృష్టిస్తుంది. ప్రపంచ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరిగితే, దాని ప్రభావం దేశీయంగా రవాణా ఖర్చులపై పడుతుంది. దాంతో ఆహార పదార్థాలు, అవసరమైన వస్తువుల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు సాధారణ ప్రజలు తమ వినియోగాన్ని తగ్గించుకోవాల్సి వస్తుంది. ఇది జీవన ప్రమాణాలను క్షీణింపజేస్తుంది.

వ్యవసాయ రంగం కూడా ఈ సంక్షోభానికి అతీతం కాదు. అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మార్పులకు లోనవుతాయి. రైతులు తమ పంటలకు సరైన ధర పొందలేకపోతారు. ఎగుమతులు తగ్గినప్పుడు రైతుల ఆదాయం పడిపోతుంది. అప్పుల భారంతో బాధపడే రైతులు మరింత సంక్షోభంలోకి నెట్టబడతారు. ఇది గ్రామీణ భారతదేశంలో సామాజిక సమస్యలకు దారితీస్తుంది. బ్యాంకింగ్ వ్యవస్థపై విశ్వాసం కూడా సంక్షోభ సమయంలో దెబ్బతింటుంది. ప్రజలు తమ డబ్బును బ్యాంకుల్లో పెట్టుబడిగా పెట్టడానికి సంకోచిస్తారు. పెట్టుబడులు తగ్గడం వల్ల ఆర్థిక వ్యవస్థలో నగదు ప్రవాహం తగ్గుతుంది. ఇది వ్యాపార కార్యకలాపాలను మరింత మందగింపజేస్తుంది. చిన్న వ్యాపారాలు మూతపడే పరిస్థితి ఏర్పడుతుంది. విద్యా రంగం కూడా ప్రభావితమవుతుంది. కుటుంబాల ఆదాయం తగ్గినప్పుడు పిల్లల విద్యపై ఖర్చులు తగ్గించాల్సి వస్తుంది. ప్రైవేట్ విద్య ఖర్చులు భరించలేక ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే అవకాశాలు తగ్గిపోతాయి. దీని వల్ల భవిష్యత్తు తరాల అభివృద్ధిపై ప్రభావం పడుతుంది. ఆరోగ్య రంగంలో కూడా ప్రతికూల ప్రభావం కనిపిస్తుంది. ఆదాయం తగ్గినప్పుడు ప్రజలు ఆరోగ్య సేవలపై ఖర్చు తగ్గించడానికి ప్రయత్నిస్తారు. ఇది ఆరోగ్య సమస్యలను మరింత తీవ్రమయ్యేలా చేస్తుంది. ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చులు భరించలేక ప్రజలు సరైన చికిత్స పొందకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. సామాజిక స్థాయిలో కూడా ఈ సంక్షోభం ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. నిరుద్యోగం పెరగడం వల్ల అసమానతలు పెరుగుతాయి. ధనిక–పేద అంతరం మరింత విస్తృతమవుతుంది. నేరాలు పెరగడం, కుటుంబ విభేదాలు పెరగడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. మానసిక ఒత్తిడి పెరగడం వల్ల వ్యక్తిగత జీవితంలో అసంతృప్తి పెరుగుతుంది.

భారతదేశం వంటి దేశం ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కొన్ని బలమైన అంశాలను కలిగి ఉంది. దేశీయ వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలకుండా నిలబడగలదు. ప్రభుత్వ విధానాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. వడ్డీ రేట్లను తగ్గించడం, ప్రజా వ్యయాలను పెంచడం, పేదలకు సబ్సిడీలు అందించడం వంటి చర్యలు ఆర్థిక వ్యవస్థను స్థిరపరచడంలో సహాయపడతాయి. సాంకేతిక రంగం అభివృద్ధి కూడా ఒక రక్షణ గోడలా పనిచేస్తుంది. డిజిటల్ లావాదేవీలు పెరగడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు కొంతవరకు కొనసాగుతాయి. స్టార్టప్ సంస్కృతి కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది. యువత కొత్త మార్గాలను అన్వేషించడం ప్రారంభిస్తుంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుంటే, ప్రపంచ ఆర్థిక సంక్షోభాలను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా వాటి ప్రభావాన్ని తగ్గించడం సాధ్యం. ఇందుకు బలమైన ఆర్థిక విధానాలు అవసరం. బ్యాంకింగ్ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చడం, పెట్టుబడులను విభిన్న రంగాల్లో విస్తరించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కీలకం. సగటు భారతీయ మానవుని స్థిరమైన జీవనానికి సామాజిక భద్రతా వ్యవస్థలు బలపడాలి. ఆరోగ్య భద్రత, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య పింఛన్లు వంటి అంశాలు విస్తృతంగా అమలు చేయాలి. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించాలి. మొత్తానికి ప్రపంచ ఆర్థిక సంక్షోభం భారతీయ సగటు మానవునిపై విస్తృత ప్రభావం చూపుతుంది. అది కేవలం ఆర్థిక అంశాలకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక, మానసిక, సాంస్కృతిక రంగాలను కూడా ప్రభావితం చేస్తుంది. అయితే సరైన విధానాలు, సమర్థవంతమైన పాలన, ప్రజలలో అవగాహన పెంపు ద్వారా ఈ ప్రభావాన్ని తగ్గించడం సాధ్యమే. భవిష్యత్తులో స్థిరమైన అభివృద్ధి సాధించాలంటే ఈ సంక్షోభాల నుంచి పాఠాలు నేర్చుకుని సమగ్ర చర్యలు తీసుకోవడం అత్యంత అవసరం. ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రభావాన్ని విశ్లేషించినప్పుడు చివరికి మనం చేరుకునే ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇది ఒక తాత్కాలిక ఆర్థిక అస్థిరత మాత్రమే కాదు; దీని ప్రభావం తరాలపాటు కొనసాగగల సామాజిక మార్పులకు దారి తీస్తుంది. భారతీయ సగటు మానవుడు ఈ ప్రభావాన్ని తన రోజువారీ జీవితంలో ప్రతి దశలో అనుభవిస్తాడు. ఉపాధి కోల్పోవడం, ఆదాయం తగ్గిపోవడం, జీవన వ్యయాలు పెరగడం వంటి సమస్యలు ఒక వ్యక్తి ఆర్థిక స్థితిని మాత్రమే కాకుండా అతని ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తాయి. ఈ నేపథ్యంలో మానసిక ఆరోగ్యం ఒక కీలక అంశంగా నిలుస్తుంది. నిరుద్యోగం, అప్పుల భారాలు, కుటుంబ బాధ్యతలు వంటి ఒత్తిడులు వ్యక్తుల్లో ఆందోళన, నిరాశ వంటి సమస్యలను పెంచుతాయి. భారతదేశంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన ఇంకా పరిమితంగానే ఉండటం వల్ల ఈ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. కాబట్టి ఆర్థిక సంక్షోభాల సమయంలో మానసిక ఆరోగ్య సేవలను విస్తరించడం అత్యవసరం. మరో ముఖ్య అంశం మహిళలపై ప్రభావం. ఆర్థిక సంక్షోభ సమయంలో కుటుంబ ఖర్చులను తగ్గించేందుకు మహిళలు ఎక్కువగా త్యాగాలు చేయాల్సి వస్తుంది. అనేక సందర్భాల్లో మహిళలు తమ ఉద్యోగాలను కోల్పోవడం లేదా తక్కువ వేతనాలతో పని చేయాల్సి రావడం జరుగుతుంది. అనధికార రంగంలో పనిచేసే మహిళలు మరింత అసురక్షిత పరిస్థితుల్లో ఉంటారు. ఇది లింగ అసమానతలను మరింత పెంచుతుంది. యువతపై ఈ సంక్షోభం ప్రభావం ప్రత్యేకంగా గమనించదగినది. విద్య పూర్తిచేసుకున్న తర్వాత సరైన ఉద్యోగం దొరకకపోవడం యువతలో నిరాశను పెంచుతుంది. ఇది దేశ భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపుతుంది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, స్టార్టప్ ప్రోత్సాహకాలు, స్వయం ఉపాధి అవకాశాలు పెంచడం ద్వారా యువతను ఆర్థికంగా బలోపేతం చేయాలి.

గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాలు ధరల మార్పులతో తీవ్రంగా నష్టపోతాయి. ప్రభుత్వ మద్దతు లేకపోతే రైతులు అప్పుల బారిన పడే ప్రమాదం ఉంది. గ్రామీణ ఉపాధి హామీ పథకాలు వంటి చర్యలు ఈ సమయంలో ముఖ్యమైన భద్రతా వలయంగా నిలుస్తాయి. సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ కూడా ఒక ద్వంద్వ ప్రభావాన్ని కలిగిస్తుంది. ఒకవైపు ఇది కొత్త అవకాశాలను సృష్టిస్తే, మరోవైపు సంప్రదాయ ఉద్యోగాలను తగ్గిస్తుంది. కాబట్టి సాంకేతిక మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం. డిజిటల్ సాక్షరతను పెంచడం ద్వారా సాధారణ ప్రజలు కొత్త ఆర్థిక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ప్రభుత్వం తీసుకునే విధానాలు ఈ సంక్షోభ ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పన్ను రాయితీలు, సబ్సిడీలు, ప్రజా వ్యయాల పెంపు వంటి చర్యలు ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి ప్రజలపై దృష్టి సారించడం ద్వారా సమాన అభివృద్ధిని సాధించవచ్చు.ఆర్థిక సంక్షోభం ఒక హెచ్చరికగా కూడా పనిచేస్తుంది.

ఇది మన ఆర్థిక వ్యవస్థలో ఉన్న బలహీనతలను బయటపెడుతుంది. బ్యాంకింగ్ రంగంలో పారదర్శకత, బాధ్యతాయుతమైన రుణ విధానాలు, పెట్టుబడుల విభిన్నీకరణ వంటి అంశాలు భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతాయి. సమాజ స్థాయిలో పరస్పర సహకారం కూడా ముఖ్యమైనది. కుటుంబాలు, సంఘాలు ఒకరికొకరు సహాయం చేసుకునే సంస్కృతి ఈ సమయంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. స్వయం సహాయక బృందాలు, సహకార సంఘాలు వంటి వ్యవస్థలు సామాజిక భద్రతను పెంచుతాయి. భారతదేశం వంటి దేశానికి పెద్ద జనాభా ఒక సవాలు మాత్రమే కాదు, ఒక అవకాశం కూడా. సరైన విధానాలతో ఈ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చగలిగితే ఆర్థిక సంక్షోభాల ప్రభావాన్ని తక్కువ చేయవచ్చు. మానవ వనరుల అభివృద్ధి, విద్యా సంస్కరణలు, ఆరోగ్య సదుపాయాల విస్తరణ వంటి చర్యలు దీర్ఘకాలిక పరిష్కారాలుగా నిలుస్తాయి.

భవిష్యత్తు దృష్ట్యా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత అనిశ్చితంగా మారే అవకాశాలు ఉన్నాయి. వాతావరణ మార్పులు, జియోపొలిటికల్ ఉద్రిక్తతలు, సాంకేతిక మార్పులు వంటి అంశాలు కొత్త సవాళ్లను సృష్టించవచ్చు. ఈ పరిస్థితుల్లో భారతదేశం స్థిరమైన, సమగ్ర అభివృద్ధి మార్గాన్ని అనుసరించాలి. సగటు భారతీయ మానవుని జీవితం స్థిరంగా ఉండాలంటే ఆర్థిక భద్రత మాత్రమే కాదు, సామాజిక భద్రత కూడా అవసరం. ప్రతి వ్యక్తికి కనీస జీవన ప్రమాణాలు అందేలా విధానాలు రూపొందించాలి. ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి ప్రాథమిక అవసరాలు అందరికీ అందుబాటులో ఉండాలి. మొత్తంగా చెప్పాలంటే, ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఒక పరీక్ష వంటిది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థ బలాన్ని, ప్రభుత్వ విధానాల సమర్థతను, ప్రజల సహనాన్ని పరీక్షిస్తుంది. భారతదేశం ఈ పరీక్షను విజయవంతంగా ఎదుర్కోవాలంటే సమగ్ర దృష్టితో ముందుకు సాగాలి. సగటు మానవుని సంక్షేమం కేంద్రంగా ఉండే అభివృద్ధి నమూనా మాత్రమే దీర్ఘకాలంలో స్థిరత్వాన్ని తీసుకురాగలదు.

ఈ నేపథ్యంలో ప్రతి వ్యక్తి కూడా ఆర్థిక అవగాహన పెంపొందించుకోవాలి. పొదుపు అలవాటు, పెట్టుబడులపై అవగాహన, ఖర్చుల నియంత్రణ వంటి అంశాలు వ్యక్తిగత స్థాయిలో రక్షణగా నిలుస్తాయి. సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే ఈ సంక్షోభాలను అధిగమించడం సాధ్యం. చివరగా, ప్రపంచ ఆర్థిక సంక్షోభం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది: స్థిరమైన అభివృద్ధి, సమాన అవకాశాలు, బలమైన సామాజిక భద్రతా వ్యవస్థలు లేకుండా ఆర్థిక పురోగతి అసంపూర్ణం. భారతదేశం ఈ దిశగా అడుగులు వేస్తే, భవిష్యత్తులో ఎలాంటి సంక్షోభం వచ్చినా సగటు మానవుని జీవితం మరింత సురక్షితంగా, స్థిరంగా ఉండగలదు.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.